# మన జనప్రగతి
తెలుగు దినపత్రిక

నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

సంపుటి : 6 సంచిక : 152 పేజీలు : 8 వెల : రూ.2/- ఆదివారం 28 జూన్ 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు
# సాగునీరు

### - నాలుగు జిల్లాల తలరాత మార్చే వెలిగొండ

- భూములు ఇచ్చిన రైతులు త్యాగం మరువలేనిది
- తొలివిడతలో నిర్వాసితులకు 300 కోట్ల పరిహారం
- కృష్ణాజలాలు వస్తాయని ఎవ్వరూ ఊహించలేదు
- గత ప్రభుత్వ పూర్తిచేయకుండానే ప్రారంభోత్సవం
- నిర్వాసిత రైతులతె సిఎం చంద్రబాబు భేటీ





**మార్కాపురం,మన జనప్రగతి జూన్ 27:** నాలుగు జిల్లాల తలరాతలు మార్చే ప్రాజెక్టు వెలిగొండ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు వృథా కావని చంద్రబాబు అన్నారు. మార్కాపురం జిల్లా పర్యటనలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించిన అనంతరం నిర్వాసితులు, లబ్దిదారులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శనివారం దోర్నాల మండలం గంటావానిపల్లిలో వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులు, రైతులతో సీఎం సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. నీళ్లు లేక చాలా మంది ఫ్లోరైడ్ వాటర్ తాగుతున్నారని.. కృష్ణా నదీ జలాలు ఈ ప్రాంతానికి వస్తాయని ఎవరూ ఆలోచన చేసి ఉండరని తెలిపారు. మిగతా2లో...

## సంక్షేమంతో పాటు..
# అభివృద్ధి కూడా ముఖ్యమే...

- కేవలం సంక్షేమంతో అభివృద్ధిని సాధించలేం
- రోడ్లు, ఆస్పత్రులు, స్కూళ్లను అభివృద్ధి చేయాలి
- కులాల పేరుతో హాస్టళ్ల ఏర్పాటు సరికాదు
- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇదే చేస్తున్నాం
- కేవలం బటన్ నొక్కితే వైకాపా గతేమయ్యిందో చూశాం
- అభివృద్ధిపై గ్రామస్థాయిలో జనసేన ఆధ్వర్యంలో చర్చ సాగాలి
- వైకాపా కులరాజకీయాలతో భ్రష్టు పట్టించే యత్నం
- 11 సీట్లు వచ్చినా తిట్ల దండకం ఆపని వైకాపా నేతలు
- జనసేన నిర్మాణ సారధుల కార్యాచరణ సమావేశంలో పవన్






**అమరావతి,మన జనప్రగతి జూన్ 27:** ఒక్క సంక్షేమ పథకాలే కాదు..అభివృద్ధి కూడా ముఖ్యమన్నది జనసేన విదానమని ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల విషయంలో జనసేన పార్టీకి ఎలాంటి వ్యతిరేకత లేదని అన్నారు. నిజంగా నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రభుత్వ సహాయం, ఉచిత పథకాలు అవసరమేనని ఆయన పేర్కొన్నారు. అయితే సంక్షేమం పేరుతో మాత్రమే ప్రభుత్వాన్ని నడపడం సాధ్యం కాదని, ప్రజలు అభివృద్ధిని కూడా కోరుకుంటారని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనసేన నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ మిగతా2లో...



## సీషెల్స్ చేరుకున్న ప్రధాని మోడీ

### ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 27:** భారత ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటన నిమిత్తం సీషెల్స్ వెళ్లారు. శనివారం సాయంత్రం సీషెల్స్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం లభించింది. ప్రవాస భారతీయులు.. భారతీయ సంప్రదాయ నృత్యాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టులోని మిగతా2లో...

## చంద్రబాబూ..ప్రభుత్వామా లేక
# గూండాల రాజ్యమా..?

- అమరావతిలో వైకాపా నేతలపై దాడులు దారుణం
- చంద్రబాబు తీరుపై ఎక్స్ వేదికగా జగన్ విమర్శలు



**అమరావతి,మన జనప్రగతి జూన్ 27:** రాజధాని ప్రాంతంలో వైసీపీ మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలపై జరిగిన దాడి ఘటనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా సీఎం చంద్రబాబు నాయుడుపై నిప్పులు చెరిగారు. చంద్రబాబు గారు.. మీరు ప్రభుత్వాన్ని నడుపుతున్నారా? లేక గూండాల రాజ్యం నడుపుతున్నారా?'అంటూ ఘాటుగా మిగతా2లో...

## మీరు రైతులను పరామర్శించేందుకు
# వెళ్లారా.. రౌడీయిజానికి వెళ్లారా..?

### - వైకాపా నేతల తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత



**అమరావతి,మన జనప్రగతి జూన్ 27:** వైసీపీ నేతలకు అమరావతిలో పర్యటించే నైతిక అర్హత లేదని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రైతులను పరామర్శించడానికి వెళ్లారా లేక రాజధానిలో రౌడీయిజం చేయటానికి వెళ్లారా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలను రాజధాని రైతులు అడ్డుకోవడంపై హోం మంత్రి అనిత స్పందించారు. 'మీరు వెళ్తే సమస్య వస్తుందని పోలీసులు ముందే చెప్పారు. మీరు వెళ్లిన పెనుమాకలో 90శాతం రైతులు రాజధానికి భూములు ఇచ్చినవారే. రైతులపై రౌడీయిజం చేయడానికి గూండాలని వెంటబెట్టుకుని వెళ్లారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులే తప్పు చేసినట్టు ఇప్పుడు వైసీపీ నేతలు మాట్లాడటం సరికాదన్నారు. మిగతా2లో...

## రెండేళ్లలో 500 నగరాలకు
# భారత్ ట్యాక్సీ సేవలు

### - గుజరాత్‌లో ట్యాక్సీ సేవలు ప్రారంభించిన అమిత్ షా




**గాంధీనగర్,మన జనప్రగతి జూన్ 27:**రెండేళ్లల్లో 500 నగరాలకు ఈ ట్యాక్సీ సేవలు విస్తరిస్తాయని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. గుజరాత్‌లో తాజాగా భారత్ ట్యాక్సీ సేవలను ఆయన ప్రారంభించారు. కోఆపరేటివ్ మోడల్‌లో డ్రైవర్లే భాగస్వాములుగా ఉండే ఈ యాప్ ప్రారంభ వేడుకల్లో హోం మంత్రి ప్రసంగిస్తూ ట్యాక్సీ సేవలు ప్రస్తుతం నిత్యావసరంగా మారాయని అన్నారు. భారత్ ట్యాక్సీలో ఇలాంటి శ్రమదోపిడీ ఉండదని హోం మంత్రి హామీ ఇచ్చారు. ఒక న్యాయమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని అన్నారు. ఇటీవల కాలంలో ఈ రంగం గణనీయంగా విస్తరించిందని అన్నారు. ప్రస్తుతం ద్విచక్రవాహనాలు కూడా బైక్ ట్యాక్సీలుగా కుంభమేళా లాంటి భారీ ఈవెంట్స్‌లో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రైవేటు రైడ్ హెయిలింగ్ యాప్స్‌పై మిగతా2లో...

## కోడూరు బీచ్‌లో విషాదం

### - ముగ్గురు చిన్నారుల గల్లంతు



**నెల్లూరు,మన జనప్రగతి జూన్ 27:** నెల్లూరు జిల్లా కోడూరు బీచ్‌లో విషాదం చోటుచేసుకుంది. ముగ్గురు చిన్నారులు గల్లంతయ్యారు. మిగతా2లో...

## అమరావతిలో అలజడి సృష్టించే కుట్ర

### - వైసిపి తీరుపై మండిపడ్డ మంత్రి నాదెండ్ల



**అమరావతి,మన జనప్రగతి జూన్ 27:** అమరావతిలో అలజడి సృష్టించేందుకు వైసీపీ కుట్ర చేస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఇటీవల తమ పర్యటనలో ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని బట్టి ఆ పార్టీ నాయకుడు జగన్ రెడ్డికి అమరావతిపై ఎంత కక్ష ఉందో అర్థమవుతోందని తెలుస్తోందన్నారు. రైతులపై దండయాత్రలా వెళ్లి రాళ్ల దాడికి దిగడాన్ని రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. అమరావతిపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదని, మిగతా2లో...


2లో

## అమరావతిని నిర్లక్ష్యం చేసి...
# ఇప్పుడు డ్రామాలా..?

రైతుల పరిరక్షణ పేరుతో వైకాపా దొంగాట

మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా పంతు | అభివృద్ధి మా లక్ష్యం
28 - 06 - 2026

# వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు

(మొదటి పేజీ తరువాయి)

రాయలసీమ, మార్కాపురం ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకురావాలని ఎన్టీఆర్ ఆలోచన చేశారని గుర్తుచేశారు. 1996 మార్చి 26న వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించామని.. రూ. 900 కోట్లు పునరావాసం కోసం కేటాయించామని అన్నారు. రూ. 300 కోట్లు మొదటి విడతలో నిర్వాసితులకు ఇస్తున్నామని చెప్పారు. ఏపీలో చాలా ఇబ్బందులు ఉన్నాయని సీఎం అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వొచ్చు. సుంకేశుల గ్యాప్ పనులను 1998లోనే ప్రారంభించాం. గత ప్రభుత్వాలు కూడా మాలాగే చేసుంటే పరిస్థితి మరోలా ఉండేది. మార్కాపురం జిల్లాలో పండ్ల తోటలు బాగా రావాలన్నారు. భూములు ఇచ్చిన రైతుల త్యాగం గొప్పది. మీరు ఇచ్చిన భూముల వల్ల నాలుగైదు జిల్లాలు బాగుపడతాయి. వెలిగొండ నీళ్లు వచ్చాక చుట్టుపక్కల భూముల విలువ పెరుగుతుంది. మాది ప్రజా ప్రభుత్వం.. అందరికీ లబ్ది చేకూరుస్తాం. కరవు జిల్లా పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని సీఎం తెలిపారు.మోసాలు చేయడంలో గొడ్డలి పార్టీ నేతలు దిట్ట. వైకాపా నేతలు కళ్లు ఆర్పకుండానే అబద్ధాలు చెబుతున్నారు. ఆ పార్టీ నేతలు ఇప్పుడు వితండ వాదం చేస్తున్నారు. వెలిగొండ పేరుతో వైకాపా ప్రభుత్వం అనేక మోసాలు చేసింది. టన్నెల్-2లో బోరు ఇరుక్కు పోయినా ప్రాజెక్టును ప్రారంభించేశారని మండిపడ్డారు. నక్సలిజంపై పోరాటం చేశానని.. క్లైమోర్ బాంబులు పెడితే వేంకటేశ్వరస్వామి తనను కాపాడారన్నారు. గత పాలకులు రూ. 10 లక్షల కోట్లు అప్పులు పెట్టిపోయారని విమర్శించారు. 3,351 వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు రూ. 300 కోట్లు జమ చేశామన్నారు. నిర్వాసితుల త్యాగం వృథా కాదని.. అందరికంటే మెరుగైన జీవితం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుపై ఈ టర్మ్‌లో రూ. 3,900 కోట్ల వ్యయం అవుతోందన్నారు. 2027 నాటికి మిగిలిన పనులన్నీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫేజ్-1, ఫేజ్-2 పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇడుపూరు, గోగులదిన్నే, తోకపల్లి తదితర పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి చేశామన్నారు. మార్కాపురానికి ప్రత్యేక జిల్లా ఇచ్చామని.. కలెక్టరేట్ కూడా పునరావాస కాలనీ పక్కనే వస్తుందని తెలిపారు. పునరావాస కాలనీ భవిష్యత్తులో ఆదర్శ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందుతుందని అన్నారు. 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు.. 23 లక్షల మందికి తాగునీరు అందేలా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని సీఎం తెలిపారు. 43.5 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. సుంకేసుల, గొట్టిపడియ డ్యామ్‌లకు రూ. 120 కోట్ల పరిపాలనా అనుమతి ఇచ్చామని.. రూ. 98 కోట్లతో సుంకేసుల పనులను ప్రారంభించినట్లు చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే వెలిగొండ ఆలస్యమైందని విమర్శించారు. పదేళ్ల ముందే ప్రాజెక్టు పూర్తయి ఉంటే రైతుల జీవితాలు మారిపోయేవన్నారు. గొడ్డలి పార్టీ మోసాలు డిజిటల్ మోసాలుగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు డ్రామాలు, మోసాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. డిజిటల్ అరెస్ట్ మోసాల తరహాలో వైసీపీ మోసాలు అంటూ దుయ్యబట్టారు. 2024లో కేటాయించిన నిధులను గత ప్రభుత్వం సరిగా వినియోగించలేదన్నారు. టన్నెల్-2లో యంత్రం చిక్కుకుపోయినా తొలగించకుండా ప్రారంభోత్సవం చేశారని విమర్శించారు. నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టం జరగనివ్వమని.. బాధిత రైతులందరికీ న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో నాలుగు జిల్లాల అభివృద్ధి, భూముల విలువ పెరుగుతుందని చెప్పారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి పూర్తి న్యాయం చేస్తామన్నారు. వెలిగొండ పెండింగ్ బిల్లులన్నీ చెల్లించామని తెలిపారు. మార్కాపురం జిల్లాకు కరువు పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని.. ఈ ప్రాంతంలో హార్టికల్చర్‌కు పెద్దపీట వేస్తామన్నారు. మార్కాపురాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని అన్నారు. హార్టికల్చర్ అభివృద్ధికి రూ. 1 లక్ష కోట్ల ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రూ. 40 వేల కోట్లు ప్రభుత్వం, రూ. 60 వేల కోట్లు ప్రైవేట్ పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎఫ్‌పీఓల ద్వారా రైతుల ఆదాయం పెంచే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రామాయపట్నం పోర్టు, ఎయిర్‌పోర్ట్‌తో ఎగుమతులకు అవకాశముందని సీఎం అన్నారు.

# సంక్షేమంతో పాటు.. అభివృద్ధి కూడా ముఖ్యమే...

(మొదటి పేజీ తరువాయి)

కార్యాచరణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్ల అభివృద్ధి కూడా చాలా ముఖ్యమని అన్నారు. దీనిపై గ్రామస్థాయిలోనే చర్చ సాగాలని పార్టీ నేతలకు పవన్ సూచించారు. కేవలం బటన్ నొక్కి నగదు బదిలీలు చేస్తే ప్రజలు ఎప్పటికీ ఓట్లు వేస్తారనే భావన సరికాదని అన్నారు... అలాంటి రాజకీయాలకు నిలువెత్తు ఉదాహరణ గత ప్రభుత్వం అని, సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కూడా సమానంగా ఉండాలని ఆయన చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, రోడ్ల నిర్మాణం వంటి అంశాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని పవన్ విమర్శించారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎంతసేపు బటన్ నొక్కి డబ్బులు పంపించామని చెప్పడం కంటే, ప్రజలు ప్రయాణించే రోడ్లు ఎవరు వేశారు? దశాబ్దాలుగా నిర్మించని రహదారులు ఇప్పుడు ఎలా నిర్మితమయ్యాయి? అనే విషయాలను కూడా చూడాలని పవన్ కల్యాణ్ అన్నారు.. ప్రజలకు సంక్షేమం ఎంత అవసరమో, నాణ్యమైన రహదారులు, ఆసుపత్రులు, ఇతర మౌలిక వసతులు కూడా అంతే అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు తమ బాధ్యతగా అభివృద్ధిపై దృష్టి పెట్టకపోతే, ఎన్ని ఉచిత పథకాలు అమలు చేసినా ప్రజలు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందరని పేర్కొన్నారు. వైకాపా నేతలు ఎప్పుడూ విధానాలపై మాట్లాడరని.. తిట్ల దండకం అందుకుంటారని జనసేన అధినేత, అన్నారు. గతంలో కాకినాడకు చెందిన వైకాపా నేత ఎంత దారుణంగా దూషించారో అంతా చూశారన్నారు. 11 సీట్లు వచ్చిన తర్వాత కూడా వైకాపా నేతలు ఏమాత్రం తగ్గకుండా మాట్లాడుతున్నారని అన్నారు. జనసేన నేత పంతం నానాజీ మాట్లాడిన మాటలు తాను విన్నానన్న పవన్.. అలాంటి వాటిని ప్రోత్సహించ నని చెప్పారు. కుల రాజకీయాలను ఎప్పటికీ ప్రోత్సహించనని, దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల పేరిట వేర్వేరు హాస్టళ్లు ఉండకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. పిల్లలందరికీ ఒకటే హాస్టల్ ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కులాలతో రాజకీయాలు చేయను, చేయబోనని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేసిన వారి వివరాలు ఎప్పటికప్పుడు సేకరిస్తా. సమాచారాన్ని పారదర్శకంగా సేకరించడమే కమిటీల బాధ్యత. కమిటీల ఎంపికపై కొందరు విమర్శలు చేస్తున్నారు.. అది సరికాదు. ఎన్ని ఏళ్లుగా కష్టపడుతున్నారనే దాన్ని బేరీజు వేసుకున్నాం. కమిటలో ఉన్న వారికి విధివిధానాలు అందిస్తాం. సేకరించిన సమాచారాన్ని నా దృష్టికి తేవాలి. ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న వారిని గుర్తించాలని పవన్ సూచించారు. గాదె సాయికృష్ణ వివాదంపై పవన్ కల్యాణ్ స్పందించారు. కృష్ణలంకలో ఒక గొడవ జరిగితే క్రిమినల్‌కు కులాన్ని ఎలా అంటగడుతున్నారని ప్రశ్నించారు. తప్పు ఎవరు చేసినా.. ఏ కులం వారు చేసినా.. తప్పే కదా అని నిలదీశారు. కాపు అయితే ఒప్పు.. ఇంకొకరు అయితే తప్పు అవుతుందా అని ప్రశ్నించారు. తనకు పేపర్లు, ఛానళ్లు లేవని.. జనసైనికులే తన మీడియా అని వ్యాఖ్యానించారు. ఇలాంటి అంశాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అన్నివర్గాలను సమానంగా చూడటమే సామాజిక న్యాయమని తెలిపారు. కుల రాజకీయం పొలిటికల్ విక్టరీ అవుతుందేమో గానీ.. సామాజిక విక్టరీ కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అధికారం ఎప్పుడూ జగన్ అండ్ కో చేతిలోనే ఉండాలా అని ప్రశ్నించారు. వైసీపీ వాళ్లను చూడాలి.. ప్రతి అంశంలోనూ కులాన్ని, మతాన్ని కూడా వాడతారని ఎద్దేవా చేశారు. వైసీపీలో పనిచేసిన నాయకులు మన వేదిక మీద ఉన్నారని ప్రస్తావించారు. వీరు దిగజారి మాట్లాడిన దాఖలాలు ఎప్పుడైనా చూశారా అని ప్రశ్నించారు. వైసీపీలో ఇతర నేతలు నోరు తెరిస్తే అసభ్య వ్యాఖ్యలే చేస్తారని.. వ్యక్తిత్వ హననాలు చేస్తారని చెప్పుకొచ్చారు. బాలినేని శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ మనిషి.. ఆయన విలువలతో మాట్లాడారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# చంద్రబాబూ..ప్రభుత్వామా లేక గూండాల రాజ్యమా..?

(మొదటి పేజీ తరువాయి)


ప్రశ్నించారు. రాజధాని ప్రాంత రైతుల ఆహ్వానం మేరకు సీఆర్డీయే పరిరక్షణ కమిటీతో కలిసి వెళ్తున్న వైసీపీ నేతలపై పట్టపగలే దాడులు చేయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ధ్వజమెత్తారు. అమరావతి పేరుతో ప్రభుత్వం చేస్తున్న అవినీతి, దోపిడీ, రైతులపై సాగిస్తున్న దౌర్జన్యాలు ఎక్కడ బయటకు వస్తాయోననే భయంతోనే చంద్రబాబు స్వయంగా ఈ దాడులను ఉసిగొల్పారని వైఎస్ జగన్ ఆరోపించారు. ఈ క్రమంలో పోలీసుల తీరును కూడా ఆయన తప్పుపట్టారు. పోలీసులు ఉన్నది ప్రజలకు భద్రత కల్పించడానికా? లేక అధికార పార్టీ అరాచకాలకు కాపలా కాయడానికా? అని ప్రశ్నించారు. ఒకటి రెండు చోట్ల పోలీస్ అధికారులే దగ్గరుండి ఈ దాడులను కో-ఆర్డినేట్ చేయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు ఇవ్వని రైతులను భూసేకరణ నోటీసులతో వేధించడం, వారి పొలాలకు వెళ్లే దారులను ధ్వంసం చేయడం, అక్రమంగా మట్టి తవ్వి దోపిడీ చేయడం లాంటి దారుణాలు అమరావతిలో సాగుతున్నాయని జగన్ పేర్కొన్నారు. కొండవీటి వాగు నీటిని బలవంతంగా రైతుల భూముల్లోకి మళ్లించి, వారికి గత్యంతరం లేని పరిస్థితులు కల్పిస్తున్నారని వైఎస్ జగన్ విమర్శించారు. రైతుల అనుమతి లేకుండానే వారి పొలాలను రిటర్నబుల్ ఎ÷-లాట్ల కింద బలవంతంగా రిజిస్ట్రేషన్లు చేయిస్తూ నరకయాతన పెడుతున్నారని మండిపడ్డారు. బాధితుల గోడు వింటూ, వారికి భరోసా ఇచ్చేందుకు వైసీపీ నేతలు వెళ్తే రౌడీయిజం చేయిస్తారా అని నిలదీశారు. అమరావతి పేరుతో ఇప్పటికే వేలాది ఎకరాలు తీసుకున్నారని.. ఇంకా ఎవరి కోసం, ఎందుకు భూములు కావాలని, మీ బినామీలకు, పచ్చ ముఠా నాయకులకు భూములు పంచడానికే రైతులను నాశనం చేస్తున్నారా అని రైతులు అడుగుతున్న ప్రశ్నలకు చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు తన అవినీతి, దోపిడీ కోసం రాష్ట్రంలో 'జంగిల్ రాజ్యాన్ని' స్థాపించారని వైఎస్ జగన్ దుయ్యబట్టారు. పోలీసులను అడ్డుపెట్టుకుని అధికార దుర్వినియోగంతో పచ్చముఠాలతో స్వైరవిహారం చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా గొంతుకలను అణచివేసేలా సాగుతున్న ఈ దుష్ట సంప్రదాయానికి రేపు రెట్టింపు స్పందన ఉంటుందని, ప్రజలు ఈ దుర్మార్గాలను క్షమించరని హెచ్చరించారు. భవిష్యత్తులో ఈ ప్రభుత్వాన్ని ప్రజలు కూకటివేళ్లతో పెకలించడం ఖాయమన్నారు. కూటమి ప్రభుత్వం చేసే దాడులకు వైయస్సార్‌సీపీ ఎట్టిపరిస్థితుల్లోనూ తలవంచదని.. అమరావతి పేరుతో జరుగుతున్న అవినీతిని, దౌర్జన్యాలను ఎప్పటికప్పుడు ఎండగడతామని స్పష్టం చేశారు. బాధితులు, రైతులు ఎప్పుడూ ఒంటరివాళ్లు కారని, వైసీపీ ఎల్లప్పుడూ వారికి తోడుగా నిలబడుతుందని వైఎస్ జగన్ పునరుద్ఘాటించారు.

# మరో పేపర్ లీక్ బట్టబయలు

### మహారాష్ట్రలో 24 గంటలముందే టెట్ పేపర్ లీక్

### నేటి టెట్ పరీక్షను రద్దు చేసిన అధికారులు

**ముంబై,మన జనప్రగతి జూన్ 27:** దేశంలో పరీక్ష పేపర్ల లీకేజీల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా మహారాష్ట్రలో 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష' టెట్ పేపర్.. పరీక్షకు 24 గంటల ముందే లీక్ కావడం కలకలం రేపింది. ఆదివారం జరగాల్సిన ఈ పరీక్షను పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు మహారాష్ట్ర పరీక్షల మండలి ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. పరీక్షల ప్రక్రియలో పారదర్శకత, నమ్మకత్వాన్ని కాపాడేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు మండలి స్పష్టం చేసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. థానే రీజియన్ పరిధిలో టెట్ క్వశ్చన్ పేపర్ లీక్ అయినట్లు శనివారం తెల్లవారుజామున పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీనిపై వెంటనే స్పందించిన భివండీ పోలీసులు ఒక రహస్య స్థావరంపై దాడి చేశారు. అక్కడ కొందరు వ్యక్తులు సీల్డ్ టెట్ క్వశ్చన్ పేపర్ ప్యాకెట్‌కు సంబంధించిన పేజీలను కలిగి ఉండడాన్ని గుర్తించారు. వెంటనే పరీక్షల మండలి అధికారులను పిలిపించి ఆ పేజీలను అసలు ప్రశ్నపత్రంతో సరిపోల్చి చూశారు.



అవి లీక్ అయిన ఒరిజినల్ పేపరేనని తేలడంతో భివండీ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,028 కేంద్రాలలో రేపు (ఆదివారం) జరగాల్సిన ఈ పరీక్ష కోసం సుమారు 4.28 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేసుకుని, కేంద్రాలకు బయలుదేరే సమయానికి పేపర్ లీక్ కారణంగా పరీక్ష వాయిదా పడడంతో లక్షలాది మంది అభ్యర్థులు తీవ్ర నిరాశకు, ఆందోళనకు గురవుతున్నారు.

# సీషెల్స్ చేరుకున్న ప్రధాని మోడీ

(మొదటి పేజీ తరువాయి)

జనం మోదీ, మోదీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీషెల్స్ ఎయిర్‌పోర్టులో తనకు లభించిన ఘన స్వాగతంపై ప్రధాని మోదీ ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. పోస్టులో.. 'అద్భుతమైన సాంస్కృతిక అనుబంధం. సీషెల్స్ ఎయిర్‌పోర్టులో లభించిన స్వాగతంలో కచ్ డ్యాన్స్ కూడా భాగమైంది. మన ప్రవాస భారతీయులు భారతదేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతులను కాపాడుకుంటున్న తీరు నిజంగా అభినందనీయం' అని పేర్కొన్నారు.

ఇక, పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య జరిగిన పలు ఒప్పందాలపై ప్రధాని మోదీ సంతకాలు చేశారు. అనంతరం బొటానికల్ గార్డెన్‌కు వెళ్లారు. 194 ఏళ్ల తాబేలును వీక్షించారు. ఆ తర్వాత ప్రవాస భారతీయులతో మోదీ సమావేశం అయ్యారు.

# మీరు రైతులను పరామర్శించేందుకు వెళ్లారా.. రౌడీయిజానికి వెళ్లారా..?

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ నేతల వెంట వెళ్లినవారిలో ఎంతమంది రౌడీషీటర్‌లు ఉన్నారో డిపా÷-టం÷-మెంట్ దగ్గర మొత్తం సమాచారం ఉందన్నారు. వైసీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తామన్నారు. అమరావతి ప్రజల కలల రాజధాని ఈరోజు శరవేగంగా ముందుకు వెళుతోందని అన్నారు. 2027 నాటికి అమరావతి పూర్తి కావాలని అందరం అహర్నిశలూ కష్టపడుతున్నామని హోం మంత్రి వెల్లడించారు. ఆనాడు అమరావతి రాజధాని అని ఒప్పుకొని తర్వాత మూడు రాజధానుల డ్రామాలాడారని విమర్శించారు. మరలా ఇప్పుడు మావిగాన్ అంటూ ఏ ముఖం పెట్టుకొని రాజధానిలో పర్యటిస్తారని ప్రశ్నించారు. అమరావతి పూర్తయితే తమకి మనుగడ కూడా ఉండదని వైసీపీ ఈ డ్రామాలు చేస్తోందని మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ అమరావతి రైతులపై రౌడీ మూకలతో చేసిన దాడే అని అన్నారు. జరిగిన ఘటనపై అధికారులను అడిగి సమాచారం తెలుసుకున్నట్లు తెలిపారు. అమరావతి రైతులు కడుపు మంటతో ఉన్నారన్నారు. అమరావతి రైతులకు అండగా ఉన్నందుకు గతంలో చంద్రబాబుపై భావ ప్రకటన స్వేచ్ఛ అంటూ దాడులు చేశారని.. కానీ మేము అలాంటి వాటిని ప్రోత్సహించడం లేదని అనిత అన్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటుందని.. విచారణ కూడా చేస్తామన్నారు. వైసీపీ నేతలను అడ్డుకుంది అమరావతి రైతులేనని.. టీడీపీ కార్యకర్తలు కాదని స్పష్టం చేశారు. ఆనాడు టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన రౌడీలు, గూండాలు నేడు రాజధాని రైతులపై దాడికి వచ్చారన్నారు. వారందరి విజువల్స్ కూడా ఉన్నాయని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

(మొదటి పేజీ తరువాయి)

కూడా విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ యాప్‌లు ఒక క్రమపద్ధతితో శ్రమదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రవాణా ఆపరేటర్లను డ్రైవర్లుగా పిలవడం కంటే సారథులని పిలుస్తానని చెప్పారు. ప్రైవేటు ఆపరేటర్లే అధిక శాతం లాభాలు దండుకుని వర్కర్లను వేధించిన ఘటనలు ఉన్నాయని అన్నారు. వినియోగదారులు, డ్రైవర్లకు ఎలాంటి నష్టం చేకూర్చని వ్యవస్థ ఇదేనని అన్నారు. ఇప్పటికే 7 లక్షల మంది డ్రైవర్లు ఈ యాప్‌లో భాగస్వాములయ్యారని అన్నారు. సుస్థిర ఆర్థిక భద్రతను సొంతం చేసుకున్నారని అన్నారు. భారత్ ట్యాక్సీలో రేట్లు ఎక్కువగా ఉన్నాయన్న వాదనలను కూడా హోం మంత్రి కొట్టిపారేశారు. ప్రత్యర్థి యాప్‌లు కావాలనే వ్యూహాత్మకంగా తమ ధరలను తగ్గిస్తున్నాయని కూడా హోం మంత్రి ఆరోపించారు. ఈ యాప్‌ను మార్కెట్ నుంచి తప్పించేందుకు ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. 'వాళ్లు ఇలా ఎంతకాలం చేయగలరు? భారత్ ట్యాక్సీ అలసిపోదు, యుద్ధ మైదానాన్ని వీడదు. నిలిచి పోరాడుతుంది. విజయం సాధిస్తుంది' అని అన్నారు. భారత్ ట్యాక్సీ దీర్ఘకాలిక అభివృద్ధికి సారథులు (డ్రైవర్లు), వినియోగదారులే బాధ్యులని అన్నారు. ఇతర కోఆపరేటివ్ సంస్థలు విజయం సాధించిన వైనాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

# కోడూరు బీచ్‌లో విషాదం

(మొదటి పేజీ తరువాయి)

సముద్రంలో స్నానం చేస్తుండగా ముగ్గురు చిన్నారులు గల్లంతయ్యారు. గల్లంతైనవారిలో సుఫియాన్ అనే నాలుగేళ్ల బాలుడు మృతి చెందగా.. ఓ బాలికను జాలర్లు రక్షించారు. మరో బాలిక కోసం గజ ఈతగాళ్లు గాలింపు చేపట్టారు. రొ÷-టటెల పండుగ కోసం చిత్తూరు జిల్లా సోమల మండలం కందుకూరుకు చెందిన మహమ్మద్ రఫీ కుటుంబం నెల్లూరు వచ్చింది. సరదాగా గడిపేందుకు తల్లిదండ్రులతో కలిసి కొత్త కోడూరు బీచ్‌కు వెళ్లారు. బీచ్‌లో ఎంజాయ్ చేస్తుండగా అలల్లో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు గత ఈతగాళ్లను రప్పించి గాలింపు చేపట్టారు. ఒక మృతదేహాన్ని స్వాధీనం చేసుకోగా.. ఇంకొకరిని రక్షించారు. మరొకరి కోసం గాలింపు చేపట్టారు. ఒకరి మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి.

# అమరావతిలో అలజడి సృష్టించే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

జగన్ రెడ్డి పాలన ఈ ప్రాంతంలో విధ్వంసంతో ప్రారంభమైందని విమర్శించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ.. 'రాష్ట్రానికి మూడు రాజధానులు అంటూ భూములు త్యాగం చేసిన రైతులను రోడ్డు మీదకు తెచ్చింది వైసీపీ ప్రభుత్వం. అమరావతి ప్రాంతంలో రైతులు నిరసనలు తెలుపుతుంటే అప్రజాస్వామికంగా వ్యవహరించింది. మహిళా రైతులను తీవ్రంగా అవమానించారు. జగన్ మెప్పు కోసం కొందరు నాయకులు ఈ ప్రాంతాన్ని శ్మశానంతో పోల్చారు. మూడు రాజధానుల విధానాన్ని రాష్ట్ర ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా తిరస్కరించారు. ఇప్పుడు జగన్ 'మావిగన్' అనే విచిత్రమైన రాజధాని గురించి మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అమరావతిలో చిన్నపాటి నిర్మాణం కూడా జరగలేదు. డిప్యూటీ సీఎం రాష్ట్రానికి బలమైన రాజధానిగా అమరావతి ఉండాలనే ఉద్దేశంతో పనులను వేగవంతం చేశారు' అని అన్నారు.ఏ

# అమరావతిని నిర్లక్ష్యం చేసి... ఇప్పుడు డ్రామాలా..?

**అమరావతి,మన జనప్రగతి జూన్ 27:**అమరావతి రైతుల పేరుతో వైసీపీ మరోసారి రాజకీయ డ్రామాకు తెరలేపిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతుల మనోభావాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం వైసీపీకి అలవాటేనని ఆరోపించారు. అమరావతిని నిర్వీర్యం చేసిన వారే ఇప్పుడు రైతుల పరిరక్షణ పేరుతో మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. అమరావతి రైతుల సంక్షేమంపై చిత్తశుద్ధిలేని వైసీపీ నేతలు.. ప్రజలను రెచ్చగొట్టి, ఆ తర్వాత బాధితులమని చూపించుకునే ప్రయత్నం చేస్తున్నారని అచ్చెన్నాయుడు విమర్శించారు. ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందడం వైసీపీ రాజకీయ శైలిగా మారిందని ఆయన అన్నారు. రాజధాని అభివృద్ధిని అడ్డుకున్న పార్టీ ఇప్పుడు అదే ప్రాంతంలో రైతుల పక్షాన నిలుస్తున్నట్లు నటించడం ప్రజలను మోసం చేయడమేనని మంత్రి వ్యాఖ్యానించారు. అమరావతిని నిర్వీర్యం చేసిన వారే రైతుల పరిరక్షణ గురించి మాట్లాడటం పూర్తిగా ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఘటనల్లో వైసీపీ నేతలు, కార్యకర్తలు పోలీసులపై దాడులకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని అచ్చెన్న ఖండించారు. చట్టాన్ని అమలు చేసే పోలీసులపై దాడులను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో హింసాత్మక రాజకీయాలకు చోటు లేదని, అలాంటి రాజకీయాలను ప్రజలు ఇప్పటికే తిరస్కరిస్తున్నారని చెప్పారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
28 - 06 - 2026

# ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలి

**● జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**



**కర్నూలు మన జనప్రగతి జూన్ 27:-** జిల్లాలో జూన్ 28 నుంచి 30 వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో పల్స్ పోలియో అవగాహన ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.జిల్లాలో మొత్తం 3,52,164 మంది ఐదేళ్లలోపు చిన్నారుల కోసం 1,630 పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూన్ 28న బూత్‌లలో పోలియో చుక్కలు వేయగా, మిగిలిన పిల్లలకు జూన్ 29, 30 తేదీల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తారని చెప్పారు.తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# కరిడికొండ బాలుడు రాజశేఖర్ కుటుంబానికి జనసేన పార్టీ ఆర్థిక 25000 సాయం



**దేవనకొండ మన జనప్రగతి జూన్ 27:**దేవనకొండ మండలం కరిడికొండ గ్రామానికి చెందిన మాదిగ రాజశేఖర్ (14) నీటి కుంటలో మునిగి ప్రమాదవశాత్తు మృతి చెందిన విషాద ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేసింది. ఈ దుర్ఘటనలో తమ కుమారుడిని కోల్పోయిన మాదిగ కృష్ణ, లక్ష్మి దంపతుల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ విషాదకర ఘటన విషయం తెలుసుకున్న వెంటనే, జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తెర్నేకల్ వెంకప్ప ఆధ్వర్యంలో జనసేన పార్టీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి రూ.25,000/- ఆర్థిక సాయం అందజేశారు.జనసేన నేతలు మాట్లాడుతూ, కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం జనసేన పార్టీ బాధ్యత అని పేర్కొన్నారు. రాజశేఖర్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. బాధలో ఉన్న కుటుంబానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు మార్కెట్ డైరెక్టర్ సరోజ ఆర్మీ రామాంజనేయులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అందరి సహకారంతో కేడీసీసీ అద్భుత లాభాలు

**- 2025-26 సంవత్సరంలో రూ.1.84 కోట్ల నికర లాభం అర్జన**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 27:-** ఉమ్మడి కర్నూలు నంద్యాల జిల్లాలో సహకార సంఘాల సభ్యులు సిబ్బంది సహకారంతో 2025- 26 సంవత్సరంలో రూ.1.84 కోట్ల రూపాయల నికర ఆదాయం సాధించినట్లు బ్యాంకు చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం నంద్యాల రోడ్డులోని కె. ఫార్చ్యూన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాల ద్వారా డిపాజిట్ల సేకరణ, రైతులకు వ్యవసాయ రుణాలు, బంగారం పై రుణాలు, ప్రధాని సూర్యాఘర్ సోలార్ యూనిట్లకు రుణాలు, రైతులకు వ్యవసాయ ఎరువుల అమ్మకాలు తదితర వాటిలో మంచి సేవలు అందించి మంచి లాభాలు సాధించామన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 39 ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ఈ సేవలు అందించినట్లు తెలిపారు. కెడిసిసి బ్యాంకుల ద్వారా 2026- 27 సంవత్సరంలో దాదాపు 700 కోట్ల రుణాలు మంజూరు చేయుటకు నిర్దేశించామన్నారు అలాగే 2026-27 సంవత్సరానికి దాదాపు 300 కోట్లు డిపాజిట్లు సేకరు లక్ష్యంగా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అనంతరం బ్యాంకుల్లో పదోన్నతులు పొందిన వారికి ప్రమోషన్ ఉత్తర్వులను చైర్మన్ అందజేశారు. చైర్మన్ ను పూలమాలలు శాలువాలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లాల సహకార సంఘం సభ్యులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక మొహర్రం: మంచూరి సూర్య నారాయణ రెడ్డి



**పోరుమామిళ్ల,మన జన ప్రగతి జూన్ 27:-** మొహర్రం వేడుకలను పురస్కరించుకొని ఉమ్మడి కడప జిల్లా డీసీసీబీ ఛైర్మెన్ మంచూరి సూర్యనారాయణ రెడ్డి, చెరుకూరి రవి కుమార్ నాయుడు తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా వెంటరాగా పోరుమామిళ్ల పట్టణంలోని లారీ ఆఫీస్ వద్ద వున్న పీర్ల చావిడిని సందర్శించుకొని పీర్లకు చదివింపులు చదివించి ప్రత్యేక ప్రార్థనలు చేయడం జరిగింది. అనంతరం అక్కడనుంచి ఉద్దికట్ట వీధి, కోట వీధిలో వున్న పీర్లను కూడా సందర్శించి ప్రార్థనలు చేయడం జరిగింది. ఈ సందర్బంగా మంచూరి మాట్లాడుతూ... శాంతి, సామరస్యం, సోదర భావాన్ని పెంపొందించి సమాజాన్ని బలోపేతం చేయడంలో ఇలాంటి పండుగలు ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. ప్రజలంతా ఈపీర్ల పండుగను ఐకమత్యంతో కలిసిమెలిసి సంతోషంగా నిర్వహించుకోవాలన్నారు. ప్రజలందరికీ మొహర్రం శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజల అవసరాలకు అనుగుణంగా పరకాల పట్టణాన్ని ఆధునికంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి




**పరకాల, మన జనప్రగతి జూన్ 27:**ప్రజల అవసరాలకు అనుగుణంగా పరకాల పట్టణాన్ని ఆధునికంగా అభివృద్ధి చేస్తామని, ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.శనివారం పరకాల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు వార్డుల అభివృద్ధి, పారిశుధ్యం, సిబ్బంది కొరత, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా తదితర అంశాలను ప్రస్తావించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2027 డిసెంబర్ నాటికి పరకాల పట్టణంలోని ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యమని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని 15 నుంచి 20 రోజుల ప్రత్యేక పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించి అన్ని వార్డులను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు చెప్పారు.స్లమ్ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి జీ ప్లస్2 విధానంలో గృహాలు అందించేందుకు కృషి చేస్తామని, ఇందుకు కౌన్సిలర్లు సహకరించాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేయాలని, అవసరమైన కాంట్రాక్టు సిబ్బందిని సీడీఎంఏ అనుమతితో నియమించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి డీపీఆర్‌లు సిద్ధం చేయాలని, మురుగు నీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంపై సోలార్ పవర్ ఏర్పాటు, ఎస్సీ కాలనీల్లో ఇంటి నంబర్లు లేని ఇళ్లకు అనుమతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు.మార్కెట్, బస్టాండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను టౌన్ ప్లానింగ్, పోలీసు శాఖల సమన్వయంతో పరిష్కరించాలని, పారిశుద్ధ్య నిర్వహణ కోసం మూడు స్వచ్ఛ ఆటోలు కొనుగోలుకు సమావేశం ఆమోదం తెలిపిందన్నారు. ప్రతి వార్డుకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ రెవెన్యూ వసూళ్లను 90 శాతానికి పెంచేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.మున్సిపల్ కమిషన ర్ పోతరాజు పవన్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పాత విధానంలోనే కొనసాగించాలి

**ప్రభుత్వం తక్షణమే బకాయిలు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి**

**బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేసిన గుజ్జ సత్యం**



**హైదరాబాద్, మన జనప్రగతి జూన్ 27:**తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై వినతిపత్రం సమర్పించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని గతంలో అమలైన పాత విధానంలోనే కొనసాగిస్తూ, పెండింగ్‌లో ఉన్న నిధులను తక్షణమే విడుదల చేయించేలా రాష్ట్ర ప్రభుత్వంపై బీసీ కమిషన్ ఒత్తిడి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ, ఉన్నత విద్య పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మరియు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల హక్కు అని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వారి విద్యాభవిష్యత్తుకు జీవనాడిగా నిలుస్తోందని అన్నారు. విధాన మార్పులు, నిధుల జాప్యం కారణంగా వేలాది మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, విద్యాసంస్థలు కూడా తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇంకా విడుదల కాకపోవడంతో విద్యార్థులపై ఫీజుల భారం పెరిగిందని, అనేక కుటుంబాలు అప్పులు చేసి పిల్లల చదువులు కొనసాగించే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. విద్యను ఆర్థిక స్తోమతతో ముడిపెట్టే పరిస్థితి ఏర్పడితే సామాజిక న్యాయ స్ఫూర్తికే విఘాతం కలుగుతుందని ఆయన హెచ్చరించారు.ఇటీవల ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై తెలంగాణ హైకోర్టు కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, పెండింగ్ బకాయిలు, అమలు విధానంపై వివరణ కోరడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోందని గుజ్జ సత్యం పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ప్రజాస్వామ్య పాలనకు తగదన్నారు.ప్రభుత్వం వెంటనే: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగావిడుదల చేయాలి.పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిరంతరాయంగా అమలు చేయాలి.విద్యార్థులపై ముందస్తు ఫీజుల భారం పడకుండా స్పష్టమైన చర్యలు తీసుకోవాలి. విద్యాసంస్థలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా సమయానుకూలంగా నిధులు విడుదల చేయాలి.బీసీ కమిషన్ రాజ్యాంగబద్ధ సంస్థగా ప్రభుత్వం దృష్టికి ఈ సమస్య తీవ్రతను తీసుకెళ్లి విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని గుజ్జ సత్యం కోరారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నడికూడలో గ్రామ సభ..



**డ్రైనేజీ, కరెంటు, కలుషిత నీరు, పలు సమస్యలను లేవనేత్తిన గ్రామస్థులు....**

**నడికూడ,మన జనప్రగతి జూన్ 27:** నడికూడ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఆవరణంలో గ్రామ సర్పంచ్ కుడ్ల మలహాల్ రావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామ కార్యదర్శి బిక్షపతి, గ్రామ వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం 16వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వం నిధులు , గ్రామ పంచాయతీ సొంత నిధుల నిధుల బడ్జెట్ ప్రణాళికపై గ్రామ కార్యదర్శి గ్రామ సభలో వినిపించడం జరిగింది.గ్రామ సర్పంచ్ మలహాల్ రావు మాట్లాడుతూ... గ్రామ ప్రజల సహకారంతోనే గ్రామం అభివృద్ధి జరుగుతుంది అని అన్నారు.గ్రామ అభివృద్ధి క్రమంగా ఒక్కటిగా పూర్తి చేస్తున్నట్టుగా తెలిపారు.. ఇందులో భాగంగా సభకు హాజరైన గ్రామస్థులు పలు సమస్యలను తెలిపారు..ప్రదానంగా తాగునీటి కలుషితంపై , కరెంటు సమస్యలపై, డ్రైనేజీల వ్యవస్థ పై,పలు సమస్యలు గ్రామ సభలో మాట్లాడారు.అలాగే గ్రామంలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని పాత గ్రామపంచాయతీ లో ఏర్పాటు చేయగా పలు ఇబ్బందులు అవుతున్నట్టుగా గ్రామస్తులు పేర్కొనడంతో దానిని ప్రస్తుత మహిళ భవనంలో ఏర్పాటు చేయాలని కోరారు. గత కొన్ని సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన డ్రైనేజీలు కావడంతో గ్రామంలోని వాడలు అస్తవ్యస్తంగా ఉన్నాయని వెంటనే డ్రైనేజీలో ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని గ్రామ సభలో కోరారు. కరెంటు సమస్యలపై పలు ఇబ్బందులు ఉన్నాయని తెలపగా సర్పంచ్ మలహాల్ రావు స్పందించి మండల కేంద్రంలో ఉన్న మండల కార్యాలయాలకు అనేక పనులపై వస్తుంటారని మండల, గ్రామ ప్రజల దృష్ట్యా కరెంట్ సమస్యలు రాకుండా చూడాలని తగిన చర్యలు తీసుకోవాలని సభకు హాజరైన అధికారికి ఆదేశించా రు. గ్రామ అభివృద్ధి కి ప్రజల అందరి సహకారం ఉండాలని అప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందని అయన పేర్కొన్నారు.. ఈ కార్యక్రమానికి గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు అంగన్వాడీ టీచర్లు, ఆషా వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు..

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక

28 - 06 - 2026

## మాధవరం-1లో స్వచ్ఛ రథం పర్యటన

● పాత సామాన్లు, ప్లాస్టిక్ వస్తువుల సేకరణపై ప్రజలకు అవగాహన




**సిద్ధవటం మన జనప్రగతి, జూన్ 27:-** మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలో శనివారం స్వచ్ఛ రథం వీధుల్లో పర్యటించింది. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా పాత సామాన్లు, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి, వాటికి సంబంధించిన సరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి చేపూరి లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ పరిశుభ్రత కోసం స్వచ్ఛ రథం సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## పీఎం గారూ.. పెంచిన పెట్రో, గ్యాస్ ధరలు తగ్గించండి: తులసి రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 27:-** కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వేంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గిన నేపథ్యంలో దేశీయంగా కూడా ఇంధన ధరలను తగ్గించాలని కోరారు. అయోధ్య బాలరాముడి ఆలయంలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఆర్థిక అక్రమాలు బీజేపీ ప్రభుత్వానికి మాయని మచ్చగా నిలిచాయని ఆయన విమర్శించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గపు సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, వేంపల్లి, చక్రాయపేట, వేముల మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, రామాంజనేయరెడ్డి, వెంకటేశు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్, రాఘవయ్య, వేమా రాజా తదితరులు పాల్గొన్నారు.

## నిత్వికను చంపిన వారికి ఉరిశిక్ష పడాలి

- రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధి చైర్మన్ పార్వతమ్మ




**లింగాల మన జనప్రగతి జూన్ 27:-** లోపట్నూతల గ్రామంలో గురువారం చిన్నారి నిత్విక (4) ను అతి కిరాతకంగా నీటి డ్రమ్ములో ముంచి చంపిన స్వాతి కి ఉరిశిక్ష పడేవిధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధి చైర్మన్ పార్వతమ్మ కోరారు. మండల పరిధిలోని లోపట్నూతల గ్రామంలో చిన్నారి నిత్విక మృతదేహానికి శనివారం పార్వతమ్మ నివాళులు అర్పించారు. అలాగే చిన్నారి కుటుంబానికి తాము అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. పార్వతమ్మ మాట్లాడుతూ ఈ సంఘటనను రాష్ట్ర హోంమంత్రి అనిత దృష్టికి కూడా తీసుకు వెళ్లి నిందితురాలు స్వాతికి ఉరిశిక్ష పడే విధంగా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబానికి ఆర్థికంగా సహాయ సహకారాలు కూడా అందేవిధంగా కృషి చేస్తామన్నారు. నిందితులను కఠినంగా శిక్షించేందుకు సీసీ ఫుటేజీలు కూడా ఉన్నాయి కావున ఎట్టి పరిస్థితుల్లో శిక్ష నుంచి నిందితులు తప్పించుకోలేరని పులివెందుల డిఎస్పీ మురళి హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా ఏటి గంగమ్మ విగ్రహ ప్రతిష్ట

● ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అధికారులు, రాజకీయ నేతలు




**సిద్ధవటం, మన జనప్రగతి, జూన్ 27:-** మండలంలోని భాకరాపేట సమీపంలో నూతనంగా నిర్మించిన ఏటి గంగమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ఏటి గంగమ్మ అమ్మవారి మూలవిరాట్టు విగ్రహాన్ని టీడీపీ సీనియర్ నేత, రాజంపేట పార్లమెంట్ మాజీ ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య సమర్పించగా, పోతురాజు విగ్రహాన్ని ఆర్టీసీ కండక్టర్ మనోహర్ రెడ్డి అందించారు. అమ్మవారి ఆలయ నిర్మాణం గ్రామస్తుల సహకారంతో పూర్తి చేసి, వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి ప్రత్యేక చండీ హోమం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పూర్ణాహుతి, మంగళ హారతి తదితర విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ సహకారం అందించారు. ఈ సందర్భంగా వేద పండితులు సురేష్ బాబు మాట్లాడుతూ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలతో గ్రామానికి శుభం కలుగుతుందని, ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరిపై అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని తెలిపారు. భక్తుల కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. సిద్ధవటం ఎస్సై హారిక అమ్మవారిని దర్శించుకొని పూలమాల సమర్పించారు. అనంతరం పుత్తా రామచంద్రయ్య కుటుంబ సభ్యులు ఎస్సై హారికను పూలమాలతో, శాలువాతో ఘనంగా సత్కరించి వేద పండితుల ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దీంతో భాకరాపేట పరిసర ప్రాంతాల్లో భక్తి వాతావరణం నెలకొంది.

## వైఎస్ జగన్‌పై టీడీపీ నేత నానాజీ వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలి

● శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్ర

● పులివెందుల డీఎస్పీకి వైయస్సార్సీపి నాయకులు ఫిర్యాదు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 27:** మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డిపై అత్యంత అసభ్యకరమైన, అప్రజాస్వామికమైన వ్యాఖ్యలు చేసిన టీడీపీ నాయకులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పులివెందుల నియోజకవర్గ వైయస్సార్సీపి ముఖ్య నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు పులివెందుల సబ్ డివిజనల్ డీఎస్పీ మురళీ నాయక్‌ను కలిసి ఫిర్యాదు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వైయస్సార్సీపి నాయకులు మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన టీడీపీ నాయకుడు పెండం వెంకటేశ్వర్లు (అబ్బాయి) ప్రెస్ మీట్ నిర్వహించి మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డిని ఉద్దేశించి వ్యక్తిగత దూషణలకు దిగారని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసమే అత్యంత అవాస్తవమైన మరియు అవమానకరమైన పదజాలాన్ని ఉపయోగించారని, వైఎస్ జగన్‌పై చేసిన వ్యాఖ్యలు అత్యంత అవమానకరంగా, రాజకీయ మర్యాదలను దాటి వ్యక్తిగతంగా కించపరిచేలా ఉన్నాయని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి ఢిల్లీ స్థాయి లీడర్ అని, ఆయనను విమర్శించే అర్హత నానాజీకి లేదని హితవు పలికారు. టీడీపీ నాయకులు వ్యక్తిగత విమర్శలు పక్కన పెట్టి, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇలాంటి బాధ్యతారాహిత్యమైన ప్రసంగాలు, విమర్శలు రాజకీయ పార్టీల మధ్య, వర్గాల మధ్య తీవ్ర విద్వేషాలను, గొడవలను రేకెత్తించేలా ఉన్నాయని నాయకులు డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే కాకుండా, ప్రజల మధ్య వైషమ్యాలు పెంచేలా టీడీపీ నాయకులు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఒక మాజీ ముఖ్యమంత్రిని, ప్రజాదరణ కలిగిన నాయకుడిని అప్రతిష్ట పాలుజేయాలనే ఉద్దేశంతోనే ఈ వ్యాఖ్యలు చేశారు. కాబట్టి ఈ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి, సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వైయస్సార్సీపి నాయకులు కోరారు. ఈ ఫిర్యాదులు అందజేసిన వారిలో వైయస్ఆర్సీపీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ హఫీజ్, టౌన్ వైయస్సార్సీపి అధ్యక్షుడు వై.గంగాధర్ రెడ్డి, కోడి రమణ, మాజీ కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, చంద్రమౌళితో పాటు పులివెందుల స్థానిక వైయస్సార్సీపి ముఖ్య నాయకులు, ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు అంకెవానిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను ప్రారంభించనున్న బిటెక్ రవి

● రైతుల కోరిక మేరకు రూ.20 లక్షల వ్యయంతో పునరుద్ధరణ

● 250 ఎకరాలకు పెరగనున్న భూగర్భ జలాలు అరటి,చీని తోటలకు లబ్ధి




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 27:-** పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని బలపనూరు డిస్ట్రిబ్యూటరీ లో ఉన్న అంకెవానిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమును నేడు ఉదయం 10 గంటలకు పులివెందుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బిటెక్ రవి) అధికారికంగా ప్రారంభించనున్నారు. చాలా రోజులుగా అసంపూర్తిగా ఉండిపోయిన ఈ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని స్థానిక రైతులు కోరారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వారి అభ్యర్థన మేరకు సుమారు 20 లక్షల రూపాయల వ్యయంతో పనులను పూర్తి చేసి ఈ స్కీమ్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావడం జరిగింది. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం అందుబాటులోకి రావడం వల్ల అంకెవానిపల్లి మరియు కామసముద్రం పరిధిలోని పొలాల్లో సుమారు 250 ఎకరాలకు భూగర్భ జలాలు భారీగా పెరగనున్నాయి. తద్వారా ఈ ప్రాంతంలో ప్రధాన పంటలైన అరటి, చీని (బత్తాయి) వంటి పండ్లతోటలను సకాలంలో కాపాడుకోవడానికి రైతులకు ఎంతో మేలు చేకూరనుంది. నేటి ఉదయం జరగబోయే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఈ స్కీం పరిధిలోని రైతులు, కూటమి నాయకులు మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా పులివెందుల టీడీపీ కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.

## పులివెందుల ఏఎంసీలో 'ఈ-ట్రాన్స్ పోర్ట్ పర్మిట్'పై అవగాహన సదస్సు

● ఇకపై ఆన్‌లైన్‌లోనే మార్కెట్ రుసుము

● మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 27:-** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన 'ఈ-ట్రాన్స్ పోర్ట్ పర్మిట్' విధానాన్ని విజయవంతం చేయడానికి వ్యాపారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరించాలని పులివెందుల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.అమర్ నాథ్ కోరారు. శనివారం పులివెందుల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో వ్యాపారులు, గుమాస్తాలు మరియు సిబ్బందికి ఈ-ట్రాన్స్ పోర్ట్ పర్మిట్ విధానంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ అమర్ నాథ్ మాట్లాడుతూ వచ్చే జులై 1వ తేదీ నుండి ఈ నూతన ఈ-ట్రాన్స్ పోర్ట్ పర్మిట్ విధానం పూర్తి స్థాయిలో అమలులోకి వస్తుందని వ్యాపారులందరూ ఇకపై మార్కెట్ రుసుమును తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే చెల్లించాల్సి ఉంటుందని పారదర్శకత కోసం తెచ్చిన ఈ నూతన విధానాన్ని అందరూ స్వాగతించి, విజయవంతం చేయాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి వి.శ్రీధర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది మరియు స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.

## చుక్కలూరు హైస్కూల్‌ను పరిశీలించిన ఎమ్మెల్సీ

● విద్యార్థుల ఆరోగ్యం,భవిష్యత్తే ముఖ్యం,భోజనం నాణ్యతలో రాజీ పడొద్దు: ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి



**తాడిపత్రి మన జనప్రగతి జూన్ 27:-** అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం చుక్కలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను సందర్శించిన ఎమ్మెల్సీ విద్యార్థులతో నేరుగా ముచ్చటించారు. ఉపాధ్యాయుల బోధనా తీరు, విద్యార్థుల చదువుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కాసేపు గడిపిన ఆయన, పాఠశాలలో రోజూ అందుతున్న మధ్యాహ్న భోజన నాణ్యతపై ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీమధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, విద్యార్థులకు నిరంతరం పౌష్టికాహారం అందించాలని సంబంధిత వంట సిబ్బందిని, పాఠశాల యాజమాన్యాన్ని ఎమ్మెల్సీ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు అత్యంత రుచికరమైన, శుచికరమైన భోజనం అందించాలని విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు మనకు అత్యంత ముఖ్యం అని పాఠశాల ఆవరణ, మరుగుదొడ్ల పరిశుభ్రతపై ఉపాధ్యాయులు, యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, స్థానిక నాయకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## లోపట్నూతల గ్రామంలో ఉద్రిక్తత

● నిత్విక మృతదేహంతో గ్రామస్థుల ఆందోళన

● సీఐలు శాంతిలాల్, శ్రీరామ్ హామీతో అంత్యక్రియలు పూర్తి



**లింగాల,మన జనప్రగతి జూన్ 27:-** మండల పరిధిలోని లోపట్నూతల గ్రామంలో శనివారం ఉదయం చిన్నారి నిత్విక (4) మృతదేహం వద్ద తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. గురువారం సాయంత్రం గ్రామ పూజారి రామాచారి కూతురు నిత్వికను పక్క ఇంటిలో నివాసముంటున్న వెంకట్రామిరెడ్డి భార్య స్వాతి నీటి డ్రమ్ములో ముంచి చంపి వేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. దీంతో నితిగా మృతదేహాన్ని పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి గురువారం రాత్రి తరలించారు అక్కడ మహిళా డాక్టర్ లేకపోవడంతో కడప రిమ్స్ కు తరలించారు. కడపలో నిత్విక మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయిన అనంతరం శనివారం లోపట్నూతల గ్రామంలో ఉదయం 8 గంటలకు భారీ ర్యాలీతో గ్రామస్తులు, మండల ప్రజలు స్మశానవాటిక వరకు వెళ్లి ఖననం చేయాలని నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న పులివెందుల డిఎస్పి మురళి నాయక్ తన సిబ్బందిని అప్రమత్తం చేసి భారీ బందోబస్తును పులివెందుల రూరల్ సిఐ శాంతిలాల్, టౌన్ సిఐ శ్రీరామ్ లఆధ్వర్యంలో గ్రామానికి పంపారు. అప్పటికే విశ్వబ్రాహ్మణ నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్దయెత్తున మండల పరిధిలోని ప్రజలు గ్రామానికి చేరుకోవడంతో గ్రామ ప్రజలతో పాటు పలువురు నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో పులివెందుల రూరల్ సీఐ శాంతిలాల్ తో పాటు పులివెందుల టౌన్ సిఐ శ్రీరామ్ ఇరువురు కలిసి నిత్విక తల్లిదండ్రులతోపాటు గ్రామాని ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా నిందితులకు ఉరిశిక్ష పడేవిధంగా తమ వద్ద సిసి ఫుటేజ్ తోపాటు పలు రకాల సాక్షాలు ఉన్నాయి కావున ఎట్టి పరిస్థితుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేవిధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామంలో నెలకొన్న ఉద్రిక్తత తగ్గడం, నిత్విక మృతదేహానికి అంత్యక్రియలు జరగడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

# పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహణ




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి జూన్ 27**: పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. మానస ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. మానస మాట్లాడుతూ, జూన్ 28 ఆదివారం నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి సమీపంలోని పల్స్ పోలియో బూత్‌లో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.సీఓఎం వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ, పిల్లల ఆధార్ కార్డు, తల్లి ఆధార్ కార్డు వెంట తీసుకుని వచ్చి పోలియో చుక్కలు వేయించుకోవాలని తెలిపారు. పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ అవగాహన ర్యాలీలో వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యం: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**గుర్రంకొండ మన జనప్రగతి జూన్ 27:–** జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యం. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా పూర్తిస్థాయి పారదర్శకత, నిష్పాక్షికతతో నిర్వహించి తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించే దిశగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. శనివారం గుర్రంకొండ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలు నెం.16, 17 పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న సర్ ఏన్యుమరేషన్ ఫారాల పంపిణీ, నమోదు ప్రక్రియ, ఓటరు వివరాల సేకరణ, ఆన్‌లైన్ డిజిటలైజేషన్ పనితీరును పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకత అత్యంత ముఖ్యమని తెలిపారు. ప్రతి అర్హ ఓటరికి సంబంధించిన సమాచారం సక్రమంగా నమోదు చేసి, సేకరించిన వివరాలను ఆలస్యం లేకుండా డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. బీఎల్ఓలకు కేటాయించిన విధులు, బాధ్యతలను వారే వ్యక్తిగతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ పనులను అనధికార వ్యక్తులకు అప్పగించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన అంభకపల్లి శ్రీ అవధూత అవులస్వామి భాగవత సప్తహ పఠనం మంత్రపుష్పం



**లింగాల మన జనప్రగతి జూన్ 27:–** లింగాల మండలంలోని అంభకపల్లి శ్రీ అవధూత అవులస్వామి ఆలయం లో భాగవత సప్తహ పఠనం మంత్రపుష్పం విజయవంతంగా ముగిసింది. శనివారం చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. అనంతరం మహిళలచే ఆలయం చుట్టూ కలశ ప్రదర్శనం నిర్వహించారు. పులివెందుల భాగవత భక్త సమాజం నిర్వహాణలో గ్రామస్థులు, దాతల సహకారాలతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా భాగవత భక్త సమాజ పాలక వర్గం సభ్యులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతం చేసిన భాగవత పండితులు, సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఆలాగే ఏడు రోజులపాటు అల్పాహారం, అన్నప్రసాదం తదితరులకు అన్నివిధాలుగా సహకరించిన దాతలను అభినందించారు. భాగవత పండితులు తదితరులకు సత్కార్యం చేశారు. ఈ కార్యక్రమంలో సమాజం అధ్యక్షులు చిన్నశివారెడ్డి, గొందిపల్లి నారాయణరెడ్డి, డి గంగిరెడ్డి, కొట్టాల రంగనాథ, తొండూరు నారాయణరెడ్డి మీడియా కన్వీనర్ యాగంటి బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహణ

**తిరుపతి మన జనప్రగతి జూన్ 27:–** జూన్ 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్, రాష్ట్ర ఎన్‌వీబీడీసీపీ డిప్యూటీ డైరెక్టర్, పల్స్ పోలియో జిల్లా పరిశీలకులు ఏటి రామనాథ రావు ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా 1,937 పోలియో బూత్‌లలో చుక్కలు వేయగా, సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఎస్వీ మెడికల్ కాలేజీ వరకు నిర్వహించిన ర్యాలీలో అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.




# ఆధ్యాత్మిక వాతావరణంలో శ్రీరామశ్రీకృష్ణ దేవాలయాల శంకుస్థాపన

● భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 27:–** ప్రొద్దుటూరు పట్టణంలోని గోకుల్ నగర్2లో నిర్మించనున్న శ్రీ రామ, శ్రీ కృష్ణ దేవాలయాల శంకుస్థాపన (భూమి పూజ) కార్యక్రమం శనివారం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తై భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, ఈవో రమణ, శంకర్ రెడ్డి, అరటి పండ్ల రమణ, బాతుబోయిన సుబ్బారావు, బుతూరు వెంకట్రామిరెడ్డి, తిప్పిరెడ్డిపల్లె దస్తగిరి, గోపాల్, ఓబుల్ రెడ్డి, టీచర్ రామసుబ్బయ్య, కొర్రపాడు రామసుబ్బయ్య, గోకుల్ నగర్ బ్రహ్మం, కృష్ణాలయం కమిటీ సభ్యులు, గోకుల్ నగర్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జూలై 10న ఆర్ బివిఆర్ఆర్ మహిళా కళాశాల స్నాతకోత్సవం




**హైదరాబాద్ మన జనప్రగతి జూన్ 27:–** రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల 15వ స్నాతకోత్సవం జూలై 10వ తేదీన నారాయణగూడ లోని కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జె. అచ్యుతదేవి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైదరాబాద్ మహిళా విద్యా సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ ఎం.ముత్యంరెడ్డి, కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ సుదర్శన్ రెడ్డి, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి. మంజుల, వైస్ ప్రిన్సిపల్ సిందూరిలతో కలిసి ప్రిన్సిపాల్ స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. 2024–25 విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించిన 302 మంది విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్స్ ను అందజేయనున్నట్లు తెలిపారు. చదువులో అత్యుత్తమంగా రాణించిన 17 మంది విద్యార్థినీలకు స్వర్ణ పతకాలను అందించనున్నట్లు తెలిపారు. స్నాతకోత్సవ వేడుకలకు మల్కాజిగిరి పోలీస్ కమీషనర్ బి. సుమతి ఐపిఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, ఓయు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ గౌరవ అతిథిగా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రధానం చేస్తారని తెలిపారు.

# రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనే గొడ్డలి పార్టీ కుట్రలు ఇక సాగవు

● అమరావతి రైతుల ఆగ్రహానికి కారణం వైసీపీ ద్వంద్వ వైఖరే: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి మన జనప్రగతి జూన్ 27:–** అమరావతి విషయంలో రాష్ట్ర ప్రజలను, రైతులను మోసం చేసిన వైసీపీ నాయకులు ఇప్పుడు మళ్లీ రైతుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. అమరావతి రాజధానిని ఐదేళ్ల పాటు నిర్వీర్యం చేసి, వేలాది మంది రైతుల జీవితాలతో చెలగాటమాడిన వారే ఇప్పుడు 'అమరావతి రైతు పరిరక్షణ' పేరుతో కొత్త నాటకాలు ఆడటం సిగ్గుచేటు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. అందుకే వైసీపీ నాయకులు ఎక్కడికి వెళ్లినా తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు అని అన్నారు. రాజకీయాల కోసం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ, ప్రజల సహనాన్ని పరీక్షిస్తే ప్రజల నుంచి తీవ్ర ప్రతిస్పందనే వస్తుంది. ప్రజలను రెచ్చగొట్టి ఆ తర్వాత బాధితులమని నటించడం వైసీపీకి అలవాటైపోయింది. ఆ రాజకీయాలకు కాలం చెల్లింది అని అచ్చెన్నాయుడు అన్నారు. అమరావతి రైతుల నిరసనలను అణచివేసేందుకు వైసీపీ పాలనలో ఎలాంటి దౌర్జన్యాలు జరిగాయో రాష్ట్ర ప్రజలకు ఇంకా గుర్తున్నాయని, ఇప్పుడు అదే రైతుల పేరుతో రాజకీయ పర్యటనలు చేయడం పూర్తిగా అవకాశవాద రాజకీయమని విమర్శించారు. గొడ్డలి పార్టీ నాయకుల పర్యటన సందర్భంగా శాంతిభద్రతలను కాపాడేందుకు విధుల్లో ఉన్న పోలీసులపైనే దాడి చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని మంత్రి మండిపడ్డారు. ఈ ఘటనలో పలువురు పోలీసులు గాయపడటం అత్యంత విచారకరమని, ప్రజాస్వామ్యంలో పోలీసులపై దాడులకు ఎలాంటి సమర్థన ఉండదని స్పష్టం చేశారు. ప్రజలను రెచ్చగొట్టడం... ఉద్రిక్తతలు సృష్టించడం... తర్వాత నాటకాలు ఆడటం గొడ్డలి పార్టీ రాజకీయాలుగా మారాయి. అలాంటి చౌకబారు రాజకీయాలను ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇక ఏమాత్రం నమ్మరు. అమరావతి రైతుల మనోభావాలను గౌరవించాల్సిందే తప్ప, వారిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం మానుకోవాలి అని మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

# అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి: సీపీఐ




**పులివెందుల, అర్బన్ మన జనప్రగతి జూన్ 27:–** అరటి, చీని రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, దళారుల దోపిడీ నుంచి రక్షించాలని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూన్ 30న జరిగే "చలో విజయవాడ" కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పులివెందులలో అరటి ప్రాసెసింగ్ యూనిట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, చీని మార్కెట్‌లో డబుల్ సూట్ విధానాన్ని రద్దు చేసి ఇతర ప్రాంతాల వ్యాపారులకు అవకాశం కల్పించాలని, దళారుల సిండికేట్‌ను అరికట్టాలని కోరారు. అలాగే సబ్సిడీ డ్రిప్ అందజేసి, రైతులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని, రైతు రుణాలు మాఫీ చేసి పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బ్రహ్మం, అంజన్నప్ప, చాంద్ భాష, సుభాన్ భాష తదితరులు పాల్గొన్నారు.

# నిత్విక మృతదేహానికి వైయస్ మధు నివాళులు






**లింగాల మన జనప్రగతి జూన్ 27:–** మండల పరిధిలోని లోపట్నూతల గ్రామంలో శనివారం ఉదయం వైకాపా నాయకుడు, తొండూరు మండల వైకాపా ఇంచార్జ్ వైఎస్ మధుసూదన్ రెడ్డి నిత్విక పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. జరిగిన సంఘటనపై తండ్రి రామాచారితో చర్చించారు. నిందితులకు కఠిన శిక్షలు పడేవిధంగా తమ పార్టీపరంగా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని కుటుంబ సభ్యులకు తెలిపారు. జరిగిన సంఘటనను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆర్థికంగా కుటుంబానికి తమ వంతు సహాయం అందే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పాత విధానంలోనే కొనసాగించాలి: గుజ్జ సత్యం



**హైదరాబాద్ మన జనప్రగతి జూన్ 27:–** ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పాత విధానంలోనే కొనసాగించి, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కోరారు. ఈ మేరకు తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో జాప్యం కారణంగా విద్యార్థులు, విద్యాసంస్థలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ప్రభుత్వం పెండింగ్ బకాయిలను విడుదల చేసి, విద్యార్థులపై ఫీజుల భారం పడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ నిర్వహించిన బీటెక్ రవి

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తాను బీటెక్ రవి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 27:–** టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించిన పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ఈ సందర్భంగా ప్రజల నుండి పలు సమస్యలను స్వీకరించడం జరిగింది.. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తాను. పులివెందుల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే నా ప్రధాన ధ్యేయం" అని అన్నారు ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు విని సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు తీసుకునేలా హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.




## డెంగ్యూ నివారణ మాసోత్సవ బ్యానర్ ఆవిష్కరణ

**తిరుపతి మన జనప్రగతి జూన్ 27:-** జూలై నెల డెంగ్యూ నివారణ మాసోత్సవంగా నిర్ధారించిన నేపథ్యంలో ఈ రోజు 27-06-2026 వ తేదీన తిరుపతి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి బాలకృష్ణ నాయక్ మరియు డిప్యూటీ డైరెక్టర్ ఏ టి రామనాథం డీఎంహెచ్వో కార్యాలయము నందు డెంగ్యూ నివారణ మాసోత్సవ బ్యానర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి నిర్మూలన కొరకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని తెలిపారు. జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలు, సచివాలయాలు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు మరియు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆరోగ్య సిబ్బంది జూలై 1 వ తారీకు నుండి 31 వ తారీకు వరకు డెంగ్యూ నివారణ మాసోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని, ప్రజలందరికీ డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన కల్పించి వ్యాధి బారిన పడకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జి కె రూప్ కుమార్ ,జిల్లా ప్రోగ్రాం అధికారులు ,జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ




**బొమ్మనహాళ్ మన జనప్రగతి జూన్ 27:-**మండల పరిధిలో ఉద్దేహాల్, బందూరు,సిద్దాపురం,కురవల్లి,చంద్రగిరి,గ్రామాల్లో నేడు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ..అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పల్లెల్లో ర్యాలీ, టామ్‌టామ్ ద్వారా ప్రచారం నిర్వహించారు,"నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు", "వేయించండి... వేయించండి... పోలియో చుక్కలు వేయించం డి" అనే నినాదాలతో ప్రజలను చైతన్యపరిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు,సుక్రసేన, సుబ్బరాయుడు, ఉపాధ్యాయు రాలు దివ్యజ్యోతి,ఎంఎల్‌హెచ్‌పీ నాగమణి,రాధమ్మ,ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్,వెంకటరమణ అంగన్‌వాడీ కార్యకర్త వనజాక్షి, సుగుణ,నాగవేణి,సునీత, వన్నూరమ్మ,ఈరమ్మ,లక్ష్మి,హరిత లక్ష్మి శ్రావణి,విద్యార్థులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహిళలకు వరంగా ఇందిరమ్మ చీరలు



**పటాన్ చెరువు మన జనప్రగతి జూన్ 27:-** రామచంద్రాపురంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ముఖ్య అతిథిగా హాజరై చీరల పంపిణీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం, సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో పంపిణీ చేసిన చీరల నాణ్యతపై విమర్శలు వచ్చాయని, అయితే ప్రస్తుత ప్రభుత్వం చేనేత కార్మికులు రూపొందించిన నాణ్యమైన వస్త్రాలను 'ఇందిరమ్మ చీరలు'గా అందించి మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తోందని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి మహిళ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయని, మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకొని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇందిరమ్మ చీరలను స్వీకరించారు. చీరల నాణ్యతపై మహిళలు సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజలు, కార్యకర్తలతో ఆత్మీయంగా మమేకమైన ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి




**అన్నమయ్య ప్రతినిధి మన జన ప్రగతి జూన్ 27:** రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయం శనివారం పార్టీ శ్రేణులతో కళకళలాడింది. ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కార్యాలయానికి విచ్చేసిన ప్రజలు, కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. వచ్చిన ప్రతి ఒక్కరినీ ఎంపీ మిథున్ రెడ్డి పేరుపేరునా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై నాయకులు, కార్యకర్తలతో సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో మరింత సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులకు సూచించారు. ప్రజా సేవే ప్రధాన లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. కార్యాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికి తమ సమస్యలను, అభిప్రాయాలను వివరించారు. ఈ కార్యక్రమంతో పార్టీ కార్యాలయంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.సంబేపల్లె గుహేశ్వరీ సమేత పసుపతినాధ విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి ఎంపీ మిథున్ రెడ్డి కి ఆహ్వానం అందచేత.. జూలై1,2,3 వ తేదీలలో జరిగే సంబేపల్లె లోని శ్రీ గుహేశ్వరీ సమేత పసుపతినాధ విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి ఎంపీ మిథున్ రెడ్డి కి, మాజీ ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి కి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానాలు అందచేశారు.రాయచోటి లోని అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి చేయూతనందిస్తాం...రాయచోటి పట్టణం సుద్దలవాండ్లపల్లె రోడ్ లోని అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి చేయూతనందిస్తామని ఎంపీ మిథున్ రెడ్డి,మాజీ ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు.ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధి పనులను మిథున్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి ల దృష్టికి తీసుకువచ్చారు.


## సర్ మ్యాపింగ్ ప్రక్రియకు ప్రతి ఓటరు సహకరించాలి

**శిబ్యాల గ్రామంలో ఓటర్ల సర్వేలో మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**అన్నమయ్య ప్రతినిధి మన జన ప్రగతి జూన్ 27 :-** ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ అధికారులు చేపడుతున్న సర్ ప్రక్రియకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.శనివారం రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామంలో రాయచోటి తహసిల్దార్ యామిని ఆధ్వర్యంలో సర్ మ్యాపింగ్ ప్రక్రియపై ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు చేపడుతున్న సర్ మ్యాపింగ్ ఓటర్ ప్రక్రియ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.ముఖ్యంగా ఓటరు కార్డుల డిజిటలేషన్ ప్రక్రియ,ఏన్యుమరేషన్ ఫారాల పంపిణీ,నమోదు ప్రక్రియ తదితర వివరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈ సందర్భంగా స్థానికుల ఇండ్ల వద్దకు వెళ్లి నమోదు చేసిన వివరాలను పరిశీలించారు.వివిధ అంశాలను తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు.అనంతరం తహసిల్దార్ యామిని మాట్లాడుతూ ఓటరు జాబితాను మరింత ఖచ్చితంగా,సమగ్రంగా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ప్రతి ఇంటికి చేరుకుని అర్హులైన ప్రతి ఓటరుకుసక్రమంగా సేకరించి వెంటనే ఆన్‌లైన్‌లో డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.ఓటర్ల కుటుంబ వివరాలు,నివాస స్థితి,కొత్తగా వచ్చిన వారు,ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి,వేగవంతంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ప్రజలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఓటరు వివరాలను సరిచేసుకోవడం,అవసరమైన మార్పులు చేర్పులు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రసవత్తరంగా ప్రగతి నగర్ డివిజన్ రాజకీయం



**కుత్బుల్లాపూర్ మన జనప్రగతి జూన్ 27: -** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలో అన్ని నియోజకవర్గాలలో పార్టీ కమిటీలను ఈ నెల 30 తేదీలోగా భర్తీచేయాలని ఆదేశాలు వచ్చిన నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ డివిజన్ కమిటీల అధ్యక్షుల ఎంపికలో ప్రగతి నగర్ అధ్యక్షుడి నియామకం తీవ్ర ఉత్కంఠ రేపుతుంది.నియోజకవర్గ కమిటీల పూర్తి బాధ్యత నియోజకవర్గ ఇంచార్జి కనుసన్నల్లో జరగాల్సి ఉంది.అయితే కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రాష్ట్ర స్థాయి నాయకులు ఎక్కువ సంఖ్యలో ఉండటం వల్ల డివిజన్ అధ్యక్షుల ఎంపిక కత్తిమీద సమూలాగా మారింది.నియోజకవర్గం లోని ముఖ్య నాయకులు అందరు కలిసి నియోజకవర్గం మొత్తం డివిజన్ అధ్యక్షుల ఎంపిక ఒక కొలిక్కి తీసుకు వచ్చినా ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షుడి ఎంపిక మాత్రం కొరకరాని కొయ్య లాగా మారింది.ప్రగతి నగర్ డివిజన్ లో కాంగ్రెస్ నాయకులు తలా ఒక వర్గం లాగా మారిపోయి అధ్యక్షుడి ఎంపిక విషయం నియోజకవర్గ ఇంచార్జి కి ఒక సవాలు లాగా మారింది.సీనియర్ నాయకులు అందరూ ఒక తాటిపై ఉండగా, నియోజకవర్గ ఇంచార్జి గారికి సన్నిహితుడు అంటూ ఒక బడా వ్యాపారవేత్త తానే డివిజన్ అధ్యక్షుడు అని కొన్ని నెలల క్రితమే అనధికారికంగా ప్రకటించుకుని తన కార్యక్రమాలను కొనసాగిస్తున్నాడు.అయితే సదరు వ్యాపారావేత్త కార్యక్రమాలలో డివిజన్ లోని కాంగ్రెస్ నాయకులు కనిపించకపోవడం చర్చనీయంశంగా మారింది.నియోజకవర్గ ఇంచార్జి కి సన్నిహితుడుగా ఉంటూ పార్టీని ముందుకు నడపాలి అంటే అందరినీ కలిపి ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉన్నప్పటికీ అందరినీ బేఖాతారు చేస్తూ తన సొంత వర్గాన్ని మాత్రమే ప్రోత్సాహస్తున్న వారి వైపు ఉంటారో లేక కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల వైపు ఉంటారో ఇక నియోజకవర్గ ఇంచార్జి నిర్ణయం పైనే ఆధారపడి ఉంది.పార్టీ కోసం పనిచేసే వాళ్ళని అధ్యక్షులుగా నియమిస్తే రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఐక్యంగా పని చేసి డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసే అవకాశం ఉంటుందని సీనియర్ నాయకులు,కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

## ప్రవక్త పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



**కడప మన జనప్రగతి జూన్ 27:-** మహా ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై బెంగాల్కు చెందిన బిజెపి నాయకురాలు నజీయా ఖాన్ చేసిన అనుచితిత వ్యాఖ్యలను ఖండిస్తూ, ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎఫ్ఐఆర్ బుక్ చేయాలని తహఫుజ్ ఎ నా మూస్ ఎ రిసాలత్ కమిటీ ఆధ్వర్యంలో కడప జిల్లా పోలీసు సూపరిండెంట్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగినది. కార్యక్రమంలో అబ్దుల్ రెహమాన్ బగ్దాది సాహెబ్, టిడిపి నాయకులు అమీర్ బాబు మన్సూర్ అలీ ఖాన్ , అబ్దుల్లా, డిసిసి మాజీ అధ్యక్షులు నజీర్ అహ్మద్ అలీ ఖాన్ సిరాజ్ బుఖారి సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాలు ర్యాలీ



**తొండూరు మన జనప్రగతి జూన్ 27:-** మండలంలోని తొండూరు గ్రామంలో డాక్టర్ గవాస్కర రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో "పల్స్ పోలియో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు, విద్యార్థులతో పోలియో కార్యక్రమం నిర్వహించి నిండుజీవితానికి రెండు చుక్కలు , పోలియో లేని గ్రామం మన లక్ష్యం లాంటి నినాదాలతో గ్రామ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి గ్రామం మధ్యలో విద్యార్థులతో మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి డాక్టర్ మాట్లాడుతు 2014 వ సంవత్సరం నుండి భారత దేశం లో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదని మన పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ లాంటి దేశాలలో పోలియో కేసులు నమోదు కావడం వలన మనదేశంలో ముందు జాగ్రత్త చర్యగా పల్స్ పోలియో కార్యక్రమం ఈనెల 28. 29,30 తేదీలలో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరముల పిల్లలవరకు లక్ష్యంగా పెట్టుకొని దాదాపు 855 మంది పోలియో చుక్కలు వేయడానికి 12 బూత్ లద్వారా, ఇరువురు పర్యవేక్షక సిబ్బంది , మొబైల్ టీమ్ ద్వారా మారు మూల గ్రామాలలో ఉన్నా తప్పుకుండా 53 మందే సిబ్బందిచే పల్స్ పోలియో చుక్కలు వేయడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సిద్ధంగా ఉన్నారని, తల్లి తండ్రులు ప్రతి ఒక్క బిడ్డకు తప్పుకుండా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఆయన కోరారు. గ్రామాలలో ఆటో ద్వారా మైక్ లో అనౌన్స్మెంట్ చేయడం జరిగింది . ఈ కార్యక్రమం లో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మల్లయ్య, మహిళ పర్యవేక్షకురాలు శీభా రాణి, ఉపాధ్యబృందం, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ వేగవంతం చేయండి

**కాలువల్లో చెత్త ఎప్పటికప్పుడు తొలగించండి: కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి**



**తిరుపతి మన జనప్రగతి జూన్ 27:-** ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఉదయం నగరంలోని పోస్టల్ కాలనీ లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను, పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఎన్యుమరేషన్ పారాలను ఇప్పటికే అందరికీ చేర్చడం జరిగిందని తెలిపారు. బి.ఎల్.ఓ. లు అందరి ఇండ్లకు వెళ్లి ఈ పారాలను గూర్చి కూలంకుశంగా వివరించి తప్పులు లేకుండా పూర్తి చేయించాలని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రత్యేక కార్యాచరణతో ఓటర్ల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నగరంలోని ప్రధాన కాలువల్లో చెత్త, మట్టి పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. లలిత, శానిటరీ సూపర్వైజర్ సుమతి, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

## ప్రతి ఓటును కాపాడండి.. సైనికుల్లా పనిచేయండి

- బీఎల్‌ఏల శిక్షణ సమావేశంలో ఎంపీ మిథున్ రెడ్డి పిలుపు



**రాయచోటి,మన జనప్రగతి జూన్ 27 :-** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR-2026) నేపథ్యంలో లక్కిరెడ్డిపల్లెలో శనివారం లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండలాల వైఎస్సార్సీపీ బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) శిక్షణ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి అర్హుడికి ఓటు ఉండేలా బీఎల్‌ఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులను నిశితంగా పరిశీలించాలని సూచించారు. అర్హుల ఓట్లు తొలగిపోకుండా, అనర్హుల పేర్లు చేరకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, తుది ఓటర్ల జాబితా వెలువడే వరకు బీఎల్‌ఏలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.హిందూపురం పరిశీలకులు రమేష్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి ఓటర్ల నమోదు ప్రక్రియ, SIR మార్గదర్శకాలపై బీఎల్‌ఏలకు అవగాహన కల్పించారు.సమావేశంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, బీఎల్‌ఏలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మనజనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా పంతం | అభివృద్ధి మా లక్ష్యం
28 - 06 - 2026

# చిన్నారి నిత్విక హత్య కేసు 24 గంటల్లో ఛేదింపు

- నిందితురాలు స్వాతి అరెస్ట్
- పాతకక్షలతోనే చిన్నారి నిత్విక దారుణ హత్య: పులివెందుల డీఎస్పీ మురళి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 27:–** లింగాల మండలం లోపట్నుతల గ్రామంలో నాలుగేళ్ల చిన్నారి నిత్విక హత్య కేసును పోలీసులు అత్యంత వేగంగా 24 గంటల్లోనే ఛేదించారు.ఈ ఘాతుకానికి ఒడిగట్టిన నిందితురాలు స్వాతిని పోలీసులు శనివారం ఉదయం 11 గంటలకు అరెస్ట్ చేసి,రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పులివెందుల డీఎస్పీ మురళి వెల్లడించారు. పులివెందుల డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను మీడియాకు వివరించారు.పోలీసుల దర్యాప్తు వివరాల ప్రకారం సృజన,శశికళ,స్వాతి గత ఏడేళ్లుగా స్నేహితులుగా ఉన్నారు.అయితే కొంతకాలంగా వీరి మధ్య తలెత్తిన విభేదాల కారణంగా స్వాతి తీవ్ర మనస్తాపానికి గురైంది.ఈ కక్ష మనసులో పెట్టుకున్న స్వాతి గతంలో ప్రతీకారంగా ద్విచక్ర వాహనాలకు నిప్పంటించిన ఘటనకు కూడా పాల్పడింది. ఆ సమయంలో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చి,బైండోవర్ కూడా నమోదు చేశారు.అయినప్పటికీ స్వాతిలో కక్ష చల్లారలేదు.ఈ క్రమంలోనే చిన్నారి నిత్వికను స్వాతి తనతో పాటు పిలుచుకుని వెళ్లిన దృశ్యాలు స్థానిక సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అనంతరం చిన్నారిని నీటి డ్రమ్ములో పడేసి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు నిందితురాలు దర్యాప్తులో అంగీకరించిందని డీఎస్పీ తెలిపారు.జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథన్ ఆదేశాల మేరకు క్లూస్ టీమ్,డాగ్ స్క్వాడ్,సీఐలు,ఎస్ఐలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సమన్వయంతో దర్యాప్తు జరిపి 24 గంటల్లోనే కేసును ఛేదించగలిగారని డీఎస్పీ మురళి నాయక్ అభినందించారు.ఈ మీడియా సమావేశంలో కేసు దర్యాప్తు అధికారి సీఐ శాంతిలాల్‌తో పాటు ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి, సీఐలు నరసింహులు,శంకర్ రెడ్డి,శ్రీరామ్,ఎస్ఐ తిమోతి, క్లూస్ టీమ్ మరియు డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# జనసేన బలోపేతానికి సమాచార సేకరణే కీలకం: డాక్టర్ దాసరి రవిశంకర్



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 27:–**జనసేన పార్టీని గ్రామ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు మరింత బలోపేతం చేసే లక్ష్యంతో మంగళగిరిలో నిర్వహించిన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కార్యక్రమంలో కడప జిల్లా సమాచార సేకరణ కమిటీ సభ్యుడు దాసరి రవిశంకర్ పాల్గొన్నారు.జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అధ్యక్షతన సీకే కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, సమాచార సేకరణ విధానం, క్షేత్రస్థాయి కమిటీల ఏర్పాటు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. పార్టీ బలోపేతంలో సమాచార సేకరణ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి గ్రామం నుంచి పార్లమెంట్ స్థాయి వరకు సమర్థవంతమైన కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నదే అధ్యక్షుడు పవన్ కల్యాణ్ లక్ష్యమని దాసరి రవిశంకర్ తెలిపారు.అనంతరం కడప జిల్లా పార్లమెంట్ సమాచార సేకరణ కమిటీ పరిశీలకులు చిలకం మధుసూదన్ రెడ్డిని రవిశంకర్ మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా పార్టీ నిర్మాణం, సమాచార సేకరణ ప్రక్రియ, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. పార్టీ అభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేసి సంస్థాగతంగా జనసేనను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు రవిశంకర్ తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి

**- ఏఈఆర్ఓలకు డీఆర్వో మల్లికార్జునుడు దిశానిర్దేశం**



**కడప మన జనప్రగతి జూన్ 27 :–** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) మల్లికార్జునుడు ఏఈఆర్ఓలకు సూచించారు.శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) నిర్వహణపై ఇటీవల ఎంపికచేసిన ఏఈఆర్ఓలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్వో మల్లికార్జునుడితో పాటు డిప్యూటీ కలెక్టర్లు హరిప్రసాద్, రంగస్వామి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో ప్రతి దశను ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల మేరకు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటలీకరణ ప్రక్రియను కచ్చితంగా నిర్వహించాలని తెలిపారు. అర్హులైన ప్రతి భారత పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు చేరకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం వచ్చే అభ్యంతరాలు, దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని, అవసరమైన చోట విచారణ నిర్వహించి తుది ఓటరు జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఆధార్‌ను కేవలం గుర్తింపు పత్రంగానే పరిగణించాలని, జనన తేదీ లేదా నివాస ధ్రువీకరణకు అది ఆధారం కాదని ఎన్నికల సంఘం మార్గదర్శకాలను వివరించారు. శిక్షణలో ఎస్ఐఆర్ ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలు, పత్రాల పరిశీలన, మ్యాపింగ్, నోటీసుల జారీ, విచారణలు, తుది ఓటరు జాబితా ప్రచురణ తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు.

# పులివెందుల అగ్నిమాపక కేంద్రాన్ని తనిఖీ చేసిన రీజనల్ ఫైర్ ఆఫీసర్ భూపాల్ రెడ్డి






**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 27:–** పులివెందుల స్థానిక అగ్నిమాపక కేంద్రాన్ని కర్నూలు జోన్ ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారి (రీజనల్ ఫైర్ ఆఫీసర్)ఎం.భూపాల్ రెడ్డి శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు.ఈ ఇన్స్పెక్షన్ కార్యక్రమంలో భాగంగా అగ్నిమాపక సిబ్బంది పనితీరును,వారి నైపుణ్యాలను ఆయన నిశితంగా పరిశీలించారు. సిబ్బందితో పిటి డ్రిల్,స్క్వాడ్ డ్రిల్ మరియు టెక్నికల్ డ్రిల్లులను చేయించారు.ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టాన్ని ఎలా నివారించాలనే దానిపై సిబ్బంది ప్రదర్శించిన డెమోలను అధికారులు వీక్షించారు.ముఖ్యంగా బహుళ అంతస్తుల భవనాలలో ప్రమాదాలు జరిగినప్పుడు, బాధితులను సురక్షితంగా రెస్క్యూ నాట్ (రెస్క్యూ తాడు) ద్వారా పై అంతస్తుల నుండి కిందికి ఎలా దించాలో సిబ్బంది ప్రత్యక్షంగా చేసి చూపించారు. అనంతరం ఫైర్ స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులను,లాగ్‌బుక్‌లను రీజనల్ ఫైర్ ఆఫీసర్ క్షుణ్ణంగా పరిశీలించి,సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఎం.భూపాల్ రెడ్డి (రీజనల్ ఫైర్ ఆఫీసర్, కర్నూలు జోన్)యు.శరత్ బాబు (జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి)పి.సునీల్ కుమార్ (స్టేషన్ ఫైర్ ఆఫీసర్, పులివెందుల)మరియు స్టేషన్ అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో అనూహ్య రద్దీ కారణంగా సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

**ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ లో ఏరోజుకారోజు జారీ చేసే 800 శ్రీవాణి దర్శనాలు రద్దు**



**తిరుమల మన జనప్రగతి జూన్ 27:–** వేసవి సెలవులు ముగిసిపోవడంతో పాటు వారాంతం రావడంతో తిరుమలలో అనూహ్య రద్దీ నెలకొన్న కారణంగా అధిక మంది భక్తులకు దర్శనాలు కల్పించేందుకు సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయడమైనది. ఈ నేపథ్యంలో ఆదివారం సిఫార్సు లేఖలు స్వీకరించబడవు.అదేవిధంగా ఆన్ లైన్ కరెంట్ బుకింగ్ లో ఏరోజుకారోజు జారీ చేసే 800 శ్రీవాణి దర్శన టికెట్ల జారీని కూడా ఆది, సోమవారాల్లో రద్దు చేయడమైనది. ఈ విషయాన్ని గమనించి భక్తులు తమ తిరుమల యాత్రకు ప్రణాళిక చేసుకోవాలని విజ్ఞప్తి చేయడమైనది.అదేవిధంగా తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్మెంట్లు, బయట క్యూలైన్లు నిండి బాలాజీ నగర్ ప్రాంతం వరకు భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. ఇంకా వేలాదిమంది భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో టీటీడీ సీనియర్ అధికారులందరూ భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు.

# జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**- ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డా. రవిబాబు**




**కడప మన జనప్రగతి జూన్ 27:–** జిల్లాలో ఆదివారం (జూన్ 28) నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ రవిబాబు పిలుపునిచ్చారు. శనివారం తన కార్యాలయంలో ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జిల్లాలో పుట్టినప్పటి నుంచి ఐదేళ్లలోపు 2,37,527 మంది చిన్నారులు పోలియో చుక్కలకు అర్హులుగా గుర్తించామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర హైరిస్క్ ప్రాంతాల్లో ప్రత్యేక పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొనే వైద్యాధికారులు, సూపర్వైజర్లు, వ్యాక్సినేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని, అవసరమైన పోలియో వ్యాక్సిన్, బ్యానర్లు, ఇతర సామగ్రిని అన్ని ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేశామని వెల్లడించారు.ఆదివారం ఉదయం 7 గంటల నుంచే పోలియో చుక్కల పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు.జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ఇన్‌చార్జి డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో చుక్కలు వేసిన వివరాలను ఆధార్ లేదా ఏబీహెచ్ఏ ఐడీ ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని, అందువల్ల తల్లిదండ్రులు పిల్లల ఆధార్‌ను వెంట తీసుకురావాలని సూచించారు.ఇప్పటికే పోలియో చుక్కలు వేసిన పిల్లలకు కూడా మళ్లీ చుక్కలు వేయించడం తప్పనిసరి అని తెలిపారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. "పోలియో నుంచి శాశ్వత రక్షణకు రెండు పోలియో చుక్కలే మార్గం" అని పేర్కొంటూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, మీడియా ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో డీపీఎంఓ మహమ్మద్ తహర్, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ ఆరెపుల్లా, డీఈఎంఓ భారతి, ఎస్‌వో రమేష్ రెడ్డి, సీహెచ్‌వో మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మర్మతుల కోసం తీసిన గొయ్యిని పూడ్చి వేయాలి: కాలనీవాసులు



**తొండూరు మన జనప్రగతి జూన్ 27:–**మండల పరిధిలోని ఎస్సీ కాలనీలో ఓబులేసు ఇంటి ముందర పైప్లైన్ మార్మత్తుల కోసము గుంత తీయగా మరమ్మతు చేసిన తర్వాత పూడ్చకుండా వదిలేయడం జరిగిందని అలా వదిలేయడం వల్ల అలా వదిలేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దీనిపైన అధికారులు స్పందించి పని పూర్తి చేయాలని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పిల్లలు వృద్దులు ఈ రస్తా వెంబడినడవాల్సిన అవసరం ఉంది గుంత ఐదు అడుగుల లోతుతో తీసి ఉండడం జరిగింది వర్షం వస్తే బజారు వెంబడి వచ్చే నీరు గుంతలోకి చేరుతాయని సైడ్ కాలువ లేనందువల్ల గుంత కనిపించదు అనే ఆలోచనతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి త్వరితగదను పూర్తి చేయాలని ప్రజల ఆకాంక్షిస్తున్నారు

# సీఎంఆర్ఎఫ్ పేదల పాలిట వరం: మంత్రి నారాయణ



**నెల్లూరు మన జనప్రగతి జూన్ 27:–** పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు.నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని 56 మంది లబ్ధిదారులకు రూ.50.34 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. గత రెండేళ్లలో 489 మందికి రూ.4.55 కోట్ల సాయం అందించినట్లు తెలిపారు.కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. అభివృద్ధిపై చేసే సద్విమర్శలను స్వీకరిస్తామని, ప్రతి అంశాన్నీ రాజకీయ కోణంలో చూడటం సరికాదని అన్నారు.

# త్యాగస్ఫూర్తికి ప్రతీక మొహరం ఉత్సవం

**- వెల్లటూరులో సాయినాథ్ శర్మకు ఘన స్వాగతం**

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి జూన్ 27:–**త్యాగానికి ప్రతిరూపమే మొహరం ఉత్సవమని వైఎస్సార్సీపీ ఎస్ఈసీ సభ్యుడు కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ పేర్కొన్నారు. కమలాపురం నియోజకవర్గం, పెండ్లిమర్రి మండలం వెల్లటూరు గ్రామంలో శనివారం సాయంత్రం గ్రామస్తుల ఆహ్వానం మేరకు నిర్వహించిన మొహరం ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.గ్రామానికి చేరుకున్న సాయినాథ్ శర్మకు మైనారిటీ నాయకులు బాబు, పీరు సాహెబ్, బాబా ఫక్రుద్దీన్, ఇరగంరెడ్డి రవికుమార్ రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా పేల్చుతూ, మంగళ వాయిద్యాలు,

బాజా భజంత్రీల నడుమ పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాయినాథ్ శర్మ మాట్లాడుతూ, మహమ్మద్ ప్రవక్త బోధించిన ధర్మాన్ని కాపాడేందుకు హసన్, హుస్సేన్‌లు చేసిన ప్రాణత్యాగానికి ప్రతీకగానే మొహరం ఉత్సవాలు నిర్వహించబడుతున్నాయని అన్నారు. వెల్లటూరు గ్రామంలో హిందూముస్లింలు ఐక్యంగా ఈ ఉత్సవాలను నిర్వహించడం సామరస్యానికి నిదర్శనమని కొనియాడారు. అలాగే మొహరం దేవుళ్ల ఆశీస్సులతో వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని ప్రతి జగనన్న అభిమాని ప్రార్థించాలని ఆయన కోరారు.

ప్రజా సంక్షేమం, సుపరిపాలన జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోనే సాధ్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వెల్లటూరు మాజీ సర్పంచ్ లక్ష్మిరెడ్డి మాధవరెడ్డి, బాలకృష్ణరెడ్డి, పద్మాకర్ రెడ్డి, వెంకటరెడ్డి, మల్లిఖార్జున, బీసీ నాయకుడు సాంబశివ, గంగయ్య, పుత్త ఆదినారాయణ రెడ్డి, సిద్ధారెడ్డి, బి. సుబ్బరాయుడు, నంద్యాల సుబ్బరాయుడు, సుబ్బారెడ్డి, నల్లబల్లె నాగేంద్రతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన పీర్ల పండగ



**వీరబల్లి,మన జనప్రగతి జూన్ 27 :-** మండలంలో గత పది రోజుల నుండి ప్రారంభమైన పీర్ల పండగ సూక్తవారం తో ముగిసింది శుక్రవారం రాత్రి ఈడిగ పల్లి నుండి పీర్లు బట్టుపల్లి మీదుగా బట్టుపల్లి రోడ్డు వద్దకు వచ్చి ఆగాయి. అనంతరం వీరబల్లి లోని పీర్లు ఆ పీర్ల ఎదురెళ్లి స్వాగతం పలికాయి దీనినే సలాం అందుకోవడం అంటారు ఈ ఘట్టం భక్తాదులను ఎంతగానో ఆకట్టుకునింది. బాణాసంచా శబ్దాలతో కొబ్బరి కాగడాల వెలుతురులో మండల కేంద్రంలోని పురవీధులన్నీ దేదీప్యమానంగా వెలిగాయి. సలాం కార్యక్రమం అనంతరం పీర్ల మండలపురా వీధుల గుండా ప్రయాణం చేసి మండల కేంద్రానికి సమీపంలో గల మాండవ్య నది వద్దకు తీసుకెళ్లి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు అనంతరం భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 27:-** కర్నూలు రేంజ్ డీఐజీ డా. కోయ ప్రవీణ్, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ప్రతి శనివారం రోడ్డు భద్రతపై పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జిల్లా పోలీసులు చర్యలు చేపట్టారు.వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. రోడ్డు భద్రతపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

# చిన్నారి నిత్విక హత్య బాధాకరం

**- కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం: బీటెక్ రవి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 27:-** లింగాల మండలం లోపట్నూతల గ్రామానికి చెందిన సృజన, రామాచారి దంపతుల నాలుగేళ్ల కుమార్తె నిత్వికను స్వాతి అనే మహిళ నీళ్ల డ్రమ్‌లో ముంచి హత్య చేసిన ఘటన తీవ్ర విషాదాన్ని కలిగించిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితురాలు స్వాతిని పోలీసులు అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టారు.ఈ నేపథ్యంలో పులివెందుల టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవిని కలిసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ, చిన్నారి మృతి విషయం తెలిసిన వెంటనే తన సతీమణి పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి , తన తమ్ముడు జోగిరెడ్డి ,లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ ,కూటమి నాయకులు, కార్యకర్తలు ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారని తెలిపారు. ఈ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు.అలాగే, ఈ కేసులో నిందితురాలు స్వాతిపై పోలీసులు ఇప్పటికే చట్టపరమైన చర్యలు చేపట్టారని, బాధిత కుటుంబానికి తప్పకుండా న్యాయం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే బాధిత కుటుంబాన్ని స్వయంగా పరామర్శించి వారికి ధైర్యం చెబుతానని, వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని బీటెక్ రవి హామీ ఇచ్చారు.

# అంధుల ఆశ్రమంలో అన్నదానం

**కొంగనపల్లె వెంకట నారాయణకుకు ఘన నివాళులు**

**ఐదో వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించిన కుటుంబ సభ్యులు**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 27:-** పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న శ్రీ వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో కీర్తిశేషులు కొంగనపల్లె వెంకట నారాయణ ఐదవ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొంగనపల్లె కుటుంబ సభ్యులు శ్రీనివాసులు, కృష్ణవేణి, రవి, అరుణ, కొండలరావు, రాజేశ్వరి, దేవి, మురళీమోహన్, సుభద్ర తదితరుల ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆశ్రమంలో వెంకట నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులు ఘన నివాళులర్పించారు. అనంతరం అంధులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు.కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ తండ్రి కొంగనపల్లె వెంకట నారాయణ వర్ధంతి సందర్భంగా ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో సేవా భావాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో అంధుల ఆశ్రమంలో అన్నదానం చేయడం ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. అవసరమైన వారికి సహాయం చేయడం ద్వారా తమ తండ్రి జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలుపుకుంటున్నామని పేర్కొన్నారు.ఆశ్రమ నిర్వాహకులు అనిమెల రామమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఆశ్రమంలోని అంధులు కుటుంబ సభ్యుల సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

# డ్రోన్లను ఆవిష్కరించిన మంత్రి నారాయణ

**రొట్టెల పండుగకు పెరుగుతున్న భక్తులు -రద్దీకి తగ్గట్టు భారీ ఏర్పాట్లు: మంత్రి నారాయణ**

**పటిష్ఠ భద్రత నిఘా కోసం నాలుగు డ్రోన్లను ఆవిష్కరించిన మంత్రి**

**లంగర్ ఖానా ప్రారంభించిన మంత్రి**

**మేయర్ సుజాత,అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, జిల్లా ఎస్పీ అజితవేజెండ్ల, కమిషనర్ నందన్‌తో కలిసి ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి**



**నెల్లూరు మన జనప్రగతి జూన్ 27:-** రొట్టెల పండుగ రెండో రోజు సందర్భంగా బారాషహీద్ దర్గాలో చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శనివారం పరిశీలించారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి పరిస్థితిని సమీక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల , మేయర్ సుజాత, మున్సిపల్ కమిషనర్ నందన్ తదితరులతో కలిసి భక్తుల భద్రత, నిఘా కోసం ఏర్పాటు చేసిన నాలుగు అత్యాధునిక డ్రోన్లను మంత్రి ప్రారంభించారు. అనంతరం లంగర్ ఖానాను ప్రారంభించి భక్తులకు భోజనం వడ్డించారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, రొట్టెల పండుగ తొలిరోజు దాదాపు 3 లక్షల మంది భక్తులు దర్గాను సందర్శించగా, రెండో రోజు 4 నుంచి 5 లక్షల మంది వరకు వచ్చారన్నారు , ప్రధాన ఘట్టమైన గంధమహోత్సవం ఖజరిగే ఆదివారం 6 నుంచి 7 లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. గంధ మహోత్సవం తర్వాత రొట్టెల పండుగ ప్రధాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నాలుగు అత్యాధునిక డ్రోన్లను వినియోగంలోకి తీసుకువచ్చామని, రాత్రి వేళల్లో కూడా స్పష్టమైన దృశ్యాలను అందించే ఈ డ్రోన్ల ద్వారా ఏరియల్ సర్వైలెన్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీసీటీవీ కెమెరాల ద్వారా దర్గా పరిసరాలు, ఘాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులందరూ సంతృప్తి చెందేలా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.రొట్టెల పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించిన తర్వాత గతంలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తుచేసిన మంత్రి, ఈసారి ప్రభుత్వం మరో రూ.5 కోట్లు కేటాయించిందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్, వక్ఫ్ బోర్డు నిధులతో కలిపి రూ.10 కోట్ల వ్యయంతో భారీ ప్రార్థనా మందిరం నిర్మిస్తున్నామని, వచ్చే రొట్టెల పండుగ నాటికి అది అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అలాగే కసుమూరు దర్గా సహా ఇతర ఆధ్యాత్మిక కేంద్రాలను అనుసంధానిస్తూ ప్రత్యేక టూరిజం సర్క్యూట్ ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా జరుగుతున్న రొట్టెల పండుగలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఏర్పాట్లు చేశామని తెలిపారు. చైన్ స్నాచింగ్, పిక్‌పాకెటింగ్, మిస్సింగ్ కేసులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. 12 నుంచి 14 సంవత్సరాల లోపు పిల్లలకు RFID సమాచార ట్యాగ్‌లు అందజేస్తున్నామని, వాటిలో తల్లిదండ్రుల వివరాలు నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ సాంకేతికత ద్వారా శనివారం మధ్యాహ్నం వరకు తప్పిపోయిన సుమారు 45 మంది పిల్లలను గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించినట్లు వెల్లడించారు.దర్గా పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, త్రాగునీరు, అన్నదానం, వైద్య సేవలు సహా అన్ని వసతులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భక్తులు వాహనాల్లో ఓవర్‌లోడ్ ప్రయాణాలు చేయకుండా, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరారు.ఈ నెల 30వ తేదీ వరకు రొట్టెల పండుగ కొనసాగనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అబ్దుల్ అజీజ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు దీక్ష, సౌజన్య, పోలీస్, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# మెట్రో ఫేజ్2లో ఇస్నాపూర్ కారిడార్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి

**• కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సత్తన్న, మెట్టు శ్రీధర్ వినతి**



**పటాన్ చెరువు మన జనప్రగతి జూన్ 27:-** హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్2లో మియాపూర్‌పటాన్‌చెరు మీదుగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ వరకు మెట్రో మార్గాన్ని విస్తరించాలని కోరుతూ మాజీ సంగారెడ్డి ఎమ్మెల్యే సత్తన్న ఆధ్వర్యంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సత్తన్న మాట్లాడుతూ, హైదరాబాద్ మెట్రో ఫేజ్2 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించడం స్వాగతించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో మెట్రో విస్తరణకు అనుకూల వాతావరణం ఏర్పడిందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మియాపూర్‌పటాన్‌చెరుఇస్నాపూర్ మార్గాన్ని కూడా ప్రాజెక్టులో చేర్చాలని కోరారు.గతంలో రాష్ట్ర ప్రభుత్వం మియాపూర్ నుంచి పటాన్‌చెరు, ఇస్నాపూర్ వరకు మెట్రో విస్తరణకు ఆమోదం తెలిపిందని గుర్తు చేసిన ఆయన, ప్రస్తుతం ఫేజ్2లో ఈ మార్గాన్ని ఐక్రిసాట్ వరకు మాత్రమే ప్రతిపాదించడం వల్ల పటాన్‌చెరు, ఇస్నాపూర్ మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరదని వివరించారు. పటాన్‌చెరుపాశమైలారం పారిశ్రామిక ప్రాంతం, ఐఐటీ హైదరాబాద్, గీతం యూనివర్సిటీతో పాటు అనేక విద్యాసంస్థలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న నివాస కాలనీలు ఈ మార్గంలో ఉన్నందున మెట్రో విస్తరణ అత్యవసరమని పేర్కొన్నారు. ఈ కారిడార్ అమలులోకి వస్తే వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులకు సౌకర్యవంతమైన రవాణా అందడంతో పాటు సంగారెడ్డి, జహీరాబాద్ మరియు సరిహద్దు కర్ణాటక ప్రాంతాల ప్రజలకు కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.అలాగే జాతీయ రహదారి65పై పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు కాలుష్య నియంత్రణకు మెట్రో ప్రాజెక్టు దోహదపడుతుందని చెప్పారు. పారిశ్రామికాభివృద్ధి, ప్రజల రవాణా అవసరాలు, భవిష్యత్ నగర విస్తరణను దృష్టిలో ఉంచుకుని మియాపూర్‌పటాన్‌చెరుఇస్నాపూర్ మెట్రో మార్గాన్ని హైదరాబాద్ మెట్రో ఫేజ్2లో చేర్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెట్రోరైల్ సాధన సమితి వ్యవస్థాపక సభ్యులు రుద్రారం శంకర్, మెట్టు శ్రీధర్, సురేందర్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మెట్రో విస్తరణ జరిగితే ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

# వెలుగొండ నిర్వాసితుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన గంగుల ఎల్లయ్య యాదవ్



**ఎర్రగొండపాలెం,మన జనప్రగతి జూన్ 27 :-** ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని దోర్నాల మండలంలో శనివారం వెలుగొండ ప్రాజెక్టును రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సందర్శించారు. అనంతరం ప్రాజెక్టు నిర్వాసితులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా పెద్దారవీడు మండలం గుండంచర్ల గ్రామ మాజీ సర్పంచ్, శ్రీ వేణుతల కాటంరాజు గంగాభవాని దేవస్థాన కమిటీ ఉపాధ్యక్షుడు గంగుల ఎల్లయ్య యాదవ్ ముఖ్యమంత్రిని కలిసి నిర్వాసితుల సమస్యలను వివరించారు. తమ గ్రామంతో పాటు మరికొన్ని గ్రామాలకు చెందిన అర్హులైన నిర్వాసితుల పేర్లు కూడా ఆర్అండ్ఆర్ (పునరావాస, పునరుద్ధరణ) ప్యాకేజీలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ గ్రామాల నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పంపిణీ చేయడం ఆనందంగా ఉందని, అయితే ఇంకా కొంతమంది అర్హులకు ప్యాకేజీ అందాల్సి ఉందని తెలిపారు. వారందరికీ కూడా న్యాయం జరిగేలా ప్రభుత్వం పెద్దమనసుతో సహాయం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. నిర్వాసితుల సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ లిడ్‌క్యాప్ చైర్మన్ గూడూరి ఎరిక్సన్ బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174